RNI TELTEL/2024/89620

నేటి శుభోదయం

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

ప్రచురణ : తెలంగాణ, సంపుటి 02, సంచిక 47, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -12, మంగళవారం - 19 - మే - 2026 , వెల రూ.5/-







# ధాన్యం సేకరణపై ప్రభుత్వం ఫోకస్

- ఖాతాల్లోకి రూ.4520 కోట్లు జమ
- 30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం
- ధాన్యం తరలింపునకు 11,500 వాహనాలు
- తెలంగాణలోని రైతులకు అదిరిపోయే గుడ్ న్యూస్



హైదరాబాద్: తెలంగాణలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వ గుడ్‌న్యూస్ తెలిపింది. ధాన్యం కొనుగోలుకు సంబంధించి నగదును రైతుల ఖాతాలోకి జమ చేసింది. ఇప్పటి వరకు 30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసిన తెలంగాణ ప్రభుత్వం అందుకు సంబంధించి రైతుల ఖాతాలోకి రూ.4520 కోట్లు జమ చేసింది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు. మిగతా..2లో

## తిరుమల కొండల్లో పచ్చదనం.. అటవీ సంరక్షణలో దేశానికే ఆదర్శంగా టీటీడీ

అటవీ సంరక్షణలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిన టీటీడీ




- శేషాచల కొండల్లో 89.40 శాతానికి చేరిన పచ్చదనం
- అక్రమ నరికివేత, వేట నివారణకు 24 గంటల పటిష్ట నిఘా
- వన్యప్రాణుల సంరక్షణ, జీవ వైవిధ్యంపై ప్రత్యేక దృష్టి
- విదేశీ మొక్కల స్థానంలో గంధం, ఎర్రచందనం పెంపకం

తిరుపతి: తిరుమల పుణ్యక్షేత్రం అనగానే శ్రీవారి దివ్యమంగళ స్వరూపంతో పాటు పచ్చని గిరులు కళ్లముందుకొస్తాయి. ఆ పవిత్ర శేషాచల కొండలు ఇప్పుడు పచ్చదనంతో మరింత కళకళలాడుతున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం మిగతా..2లో

## కరీంనగర్ సింహగర్జన సభ @25.. కేటీఆర్ ప్రత్యేక పోస్ట్




హైదరాబాద్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక సభ అయిన కరీంనగర్ సింహగర్జన సభకు 25 ఏళ్లు నిండాయి. ఈ మేరకు అప్పటి పేపర్ క్లిప్పింగ్‌లను ట్యాగ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 2001 మే 17న జరిగిన సింహగర్జన నుంచి ఇటీవలే పూర్తయిన రజతోత్సవ వేడుకల వరకు బీఆర్ఎస్ పార్టీ అదే జోష్‌లో ఉందని అన్నారు. కనుచూపు మేరల్లో అంతా అంధకారం, అన్నీ అపనమ్మకాలు, గత కాలపు గాయాలు.. ధనం బలం లేదు.. రాజకీయ బలగం లేదు. అయినా సింహగర్జన సభకి జనం పోటెత్తిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. తనను కన్నభూమి తెలంగాణ.. ఎందుకిలా గోస పడుతుందన్న ఆవేదన, మాతృభూమిపై గుండెల నిండా పొంగే తెలంగాణ ప్రేమ, రాష్ట్రాన్ని సాధించాలన్న నిండైన పట్టుదల, ప్రజలు అండగా ఉంటారన్న భరోసా.. ఈ నాలుగే ఉద్యమ నాయకుడు కేసీఆర్‌ను నడిపించిన నాలుగు రథ చక్రాలని కేటీఆర్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

## భారత్‌కు డబుల్ షాక్.. రష్యా చమురుపై అమెరికా ఆంక్షలతో కొత్త చిక్కులు




- రష్యా చమురుపై అమెరికా ఆంక్షల మినహాయింపునకు ముగింపు
- ఇరాన్ యుద్ధంతో ఇప్పటికే అస్థిరంగా చమురు సరఫరా
- భారత్‌పై ఒకేసారి రెండు వైపుల నుంచి ఇంధన ఒత్తిడి

## సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 38కి పెంపు.. ఆర్డినెన్స్ జారీ చేసిన రాష్ట్రపతి

- సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కి పెంచిన కేంద్ర ప్రభుత్వం
- ఈ మేరకు జారీ చేసిన ఆర్డినెన్స్‌కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం
- పెండింగ్‌లో ఉన్న 92,000 కేసులను తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం
- 1956 నాటి న్యాయమూర్తుల సంఖ్య చట్టానికి సవరణ

ఢిల్లీ: దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జడ్జీల సంఖ్యను 34 నుంచి 38కి పెంచుతూ ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ ఆర్డినెన్స్‌పై ఆమోదముద్ర వేయడంతో ఇది తక్షణమే అమల్లోకి వచ్చింది. సుప్రీంకోర్టులో పేరుకుపోయిన కేసుల భారాన్ని మిగతా..2లో






## మూడు రాష్ట్రాల్లో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టు

- తెలంగాణలో 93 కిమీ.. కోకాపేట, వికారాబాద్‌లలో రైల్వేస్టేషన్లు
- మహారాష్ట్ర పరిధిలో 3 ప్రాంతాల్లో 35 కిమీ మేర భూగర్భ మార్గం
- స్టేషన్లు 12.. వేగం 300 కిమీ.. దూరం 671 కిమీ

హైదరాబాద్: హైదరాబాద్ నుంచి దేశ ఆర్థిక రాజధాని ముంబయి నగరానికి ప్రస్తుతం రోడ్డు మార్గంలో అయితే సుమారు 12 గంటలు..

## ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవాలి

కీలక రంగాల్లో పరస్పరం సహకరించుకుందాం

- సహకారమే మన బలం
- భారత ప్రధాని మోదీ, స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్ నిర్ణయం
- బంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచాలని నిర్ణయం



గోథెన్‌బర్గ్: సహకారమే మన బలమని భారత ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. మోదీ స్వీడన్ ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టర్సన్‌తో సమావేశమయ్యారు. ఇరుదేశాల మధ్య మిగతా..2లో

## ఇరాన్‌లో శ్రీమహావిష్ణువు ఆలయం... ఎక్కడుందో చెప్పిన అమితాబ్ బచ్చన్




- ఇరాన్‌లోని విష్ణు ఆలయం వీడియోను షేర్ చేసిన అమితాబ్ బచ్చన్
- 135 ఏళ్ల ఆలయాన్ని పొరపాటున పురాతన ఆలయంగా పేర్కొన్న బిగ్ బీ
- 1892లో భారత వ్యాపారుల కోసం ఈ ఆలయం నిర్మాణం

## 'సర్'పై రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ఉద్యోగుల మీద నమ్మకం లేదేమో!



- కేంద్రమే డబ్బులు ఇస్తుంటే ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందేంటి?
- అనర్హుల ఓట్లు కచ్చితంగా తొలగిస్తారు
- బండి భగీరథ్ కేసులో కేంద్ర ప్రమేయం ఉండదు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల వరికి కనీస మద్దతు ధర పెంచినా.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతుల ధాన్యం ఇంకా కల్లాల్లోనే ఉందని మిగతా..2లో

# సిగరెట్లపై పెంచిన పన్నులను పునఃసమీక్షించాలి

రొయ్యల మేత ధరల పెరుగుదలపై జోక్యం చేసుకోవాలి

- ఆక్వా, పొగాకు రైతుల కోసం... కేంద్రానికి చంద్రబాబు లేఖలు
- ఆక్వా, పొగాకు రైతుల సమస్యలపై కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖలు
- మేత ధరల నియంత్రణకు నెలవారీ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
- రైతుల ప్రయోజనాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని ఆక్వా, పొగాకు రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. వారిని ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి వేర్వేరుగా లేఖలు రాశారు. రొయ్యల మేత ధరల పెరుగుదల, మిగతా..2లో

## బీసీ జనాభాలో తొలి మూడు స్థానాల్లో శ్రీకాకుళం, కర్నూలు, విశాఖ




- రాష్ట్ర జనాభాలో సగం బీసీలే
- 2024- కులగణన నివేదికలో వెల్లడి
- 2.68 కోట్ల మందితో వెనుకబడిన వర్గాల వాటా 50.59%
- ఉత్తరాంధ్రలో బడుగులే సింహభాగం

## ఇరాన్‌తో శాంతి చర్చలకు అమెరికా 5 కండిషన్లు

శాంతి చర్చల్లో ఇరాన్‌కు కఠిన షరతులు పెట్టిన అమెరికా




- 400 కేజీల యురేనియం అప్పగించాలని డిమాండ్
- ఆంక్షలు ఎత్తివేస్తేనే చర్చలంటూ ఇరాన్ ఎదురు ప్రతిపాదన
- అమెరికా ద్వంద్వ వైఖరిపై ఇరాన్ విదేశాంగ శాఖ తీవ్ర విమర్శలు

## ఇరాన్‌తో శాంతి చర్చలకు అమెరికా 5 కండిషన్లు

ఢిల్లీ: అమెరికా, ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. చర్చలు ముందుకు సాగాలంటే ఇరాన్ ముందు అమెరికా ఐదు కఠినమైన షరతులు ఉంచినట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. ఈ షరతులు ఇరాన్‌కు ఆమోదయోగ్యంగా లేకపోవడంతో చర్చల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఇరాన్‌కు చెందిన 'ఫార్స్ న్యూస్' ఏజెన్సీ కథనం ప్రకారం గతంలో విధించిన ఆంక్షల వల్ల జరిగిన నష్టానికి ఎలాంటి పరిహారం చెల్లించే ప్రసక్తే లేదని అమెరికా స్పష్టం చేసింది. చర్చల్లో భాగంగా 400 కిలోల శుద్ధి చేసిన యురేనియంను తమకు అప్పగించాలని డిమాండ్ చేసింది. అంతేకాకుండా, ఇరాన్‌లోని అణు కేంద్రాల్లో ఒక్కదానికి మాత్రమే పనిచేసే అనుమతి ఉంటుందని మరో షరతు పెట్టింది. విదేశాల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల్లో 25 శాతం కూడా విడుదల చేసేందుకు నిరాకరించినట్లు సమాచారం. ఈ షరతులన్నింటికీ ఇరాన్ అంగీకరించినా, అమెరికా-ఇజ్రాయెల్ దాడుల ముప్పు మాత్రం తొలగిపోదని కూడా ఈ నివేదిక పేర్కొంది. అమెరికా తీరుపై ఇరాన్ కూడా తీవ్రంగా స్పందించింది. శాంతి చర్చలు జరగాలంటే తమకు కూడా ఐదు 'విశ్వాసం కలిగించే' షరతులు ఉన్నాయని తేల్చి చెప్పింది. అన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా లెబనాన్‌లో ఘర్షణలకు ముగింపు పలకాలని, తమపై విధించిన ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయాలని, స్తంభింపజేసిన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేసింది. యుద్ధ నష్టాలకు పరిహారం చెల్లించడంతో పాటు, కీలకమైన చమురు రవాణా మార్గమైన హార్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమత్వాన్ని గుర్తించాలని కోరింది. ఈ పరిణామాలపై ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బకాయి తీవ్రంగా స్పందించారు. శాంతి, స్థిరత్వం పేరుతో అమెరికా, ఇజ్రాయెల్ నాటకాలాడుతున్నాయని, వారే సంక్షోభాన్ని సృష్టించి శాంతి పరిరక్షకులుగా నటిస్తున్నారని ఆయన ఆరోపించారు. "విధ్వంసం సృష్టించి, దాన్నే శాంతి అని పిలవడం వారి పాత ఎత్తుగడ" అని సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు. మరోవైపు, అమెరికా మళ్లీ సైనిక దాడులకు పాల్పడితే మరింత తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్ సైనిక అధికార ప్రతినిధి హెచ్చరించారు.

### భారత్‌కు డబుల్ షాక్.. రష్యా చమురుపై
## అమెరికా ఆంక్షలతో కొత్త చిక్కులు

ఢిల్లీ: గత కొన్నాళ్లుగా ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంక్షోభం నుంచి అతి తక్కువ నష్టంతో బయటపడుతూ వచ్చిన భారత్‌కు ఇప్పుడు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రష్యా నుంచి చమురు దిగుమతులపై అమెరికా విధించిన ఆంక్షలకు ఇచ్చిన మినహాయింపు గడువు ఆదివారంతో ముగిసింది. ఈ నిర్ణయంతో భారత్ ఇంధన సమీకరణాలు పూర్తిగా మారిపోయే ప్రమాదం ఏర్పడింది. ఒకవైపు ఇరాన్ యుద్ధం కారణంగా హార్మూజ్ జలసంధిలో చమురు రవాణా అస్థిరంగా మారగా, ఇప్పుడు రష్యా చమురుపై ఆంక్షల ముప్పు భారత్‌ను రెండు వైపుల నుంచి ఒత్తిడిలోకి నెట్టింది. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆంక్షలు విధించడంతో భారత్ ఆ అవకాశాన్ని అందిపుచ్చుకుంది. తక్కువ ధరకే లభిస్తున్న రష్యా చమురును భారీగా దిగుమతి చేసుకుని ద్రవ్యోల్బణం నుంచి రక్షణ కవచంగా వాడుకుంది. మే నెలలో రికార్డు స్థాయిలో రోజుకు 2.3 మిలియన్ బ్యారెళ్ల రష్యా చమురును భారత్ దిగుమతి చేసుకుంది. కొన్ని సందర్భాల్లో ఇది మన మొత్తం చమురు దిగుమతుల్లో సగానికి చేరింది. అయితే, తాజాగా అమెరికా తీసుకున్న నిర్ణయంతో భారత రిఫైనరీలకు ఆంక్షల భయం పట్టుకుంది.

తప్పని ధరల పెంపు?

ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 105 డాలర్లకు పైగా ట్రేడ్ అవుతోంది. ఇరాన్ యుద్ధం కారణంగా మధ్యప్రాచ్యం నుంచి చమురు సరఫరా ఎప్పుడు నిలిచిపోతుందో తెలియని పరిస్థితి. ఇప్పుడు చౌకగా లభించే రష్యా చమురుకు కూడా ఆంక్షల ముప్పు ఏర్పడటంతో భారత్‌కు గడ్డుకాలం తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు. తన అవసరాల్లో 85 శాతానికి పైగా చమురును దిగుమతి చేసుకునే భారత్‌పై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను ఇటీవల లీటర్‌కు రూ.3 చొప్పున పెంచారు. తాజా పరిణామాలతో మళ్లీ ధరలు పెంచడం అనివార్యమని తెలుస్తోంది. పెట్రోస్ స్టోన్ ఎల్ఎల్‌పీ డైరెక్టర్ రిషభ్ జైన్ మాట్లాడుతూ "ఇంధన ధరల పెంపుతో దేశీయ లాజిస్టిక్స్, అంతర్జాతీయ రవాణా ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. చాలా కంపెనీలు ఉత్పత్తిని తగ్గించి, తమ వద్ద ఉన్న నిల్వలతోనే ఆర్డర్లను పూర్తి చేస్తున్నాయి" అని వివరించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పన్నులు తగ్గించడం, సబ్సిడీలు ఇవ్వడం వంటి చర్యలు ఖజానాపై భారం మోపుతాయి. మరోవైపు, ధరలు పెంచితే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుంది. ఈ సంక్షోభం ఇలాగే కొనసాగితే, గతంలో మాదిరిగా ఇంధనాన్ని ఆదా చేసేందుకు వర్క్ ఫ్రమ్ హోమ్, కార్యాలయ వేళల్లో మార్పులు వంటి చర్యలను ప్రభుత్వం మళ్లీ పరిశీలించే అవకాశం లేకపోలేదు.

## ఇరాన్‌లో శ్రీమహావిష్ణువు ఆలయం... ఎక్కడుందో చెప్పిన అమితాబ్ బచ్చన్

ఢిల్లీ: బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్ తన సోషల్ మీడియా ఫాలోయర్స్‌కు చరిత్ర పాఠాలు చెప్పే ప్రయత్నం చేశారు. ఆదివారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఇరాన్‌లోని బందర్ అబ్బాస్‌లో ఉన్న ఒక హిందూ విష్ణు ఆలయం వీడియోను పంచుకున్నారు. 'ఏ విష్ణు జాన్' అనే పర్షియన్ గీతాన్ని జతచేసి ఈ వీడియోను పోస్ట్ చేశారు. అయితే, సుమారు 135 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయాన్ని ఆయన పొరపాటున "పురాతన ఆలయం" అని పేర్కొనడం చర్చనీయాంశమైంది. "ఇరాన్‌లోని బందర్ అబ్బాస్‌లో ఉన్న పురాతన హిందూ విష్ణు ఆలయం.. 1892లో ఖజార్ శకంలో నిర్మించబడింది. నగరంలో పనిచేస్తున్న భారతీయ హిందూ వ్యాపారుల కోసం దీనిని నిర్మించారు" అని అమితాబ్ తన క్యాప్షన్‌లో రాసుకొచ్చారు. ఆయన చెప్పినట్లుగా ఇది 1892లో నిర్మితమైనప్పటికీ, దానిని పురాతన ఆలయంగా అభివర్ణించడంపై నెటిజన్లు స్పందిస్తున్నారు. భారత్, ఇరాన్ మధ్య వేల సంవత్సరాల నాటి సాంస్కృతిక, చారిత్రక బంధం ఉంది. 1947లో దేశ విభజనకు ముందు భారత్, ఇరాన్‌కు సరిహద్దు ఉండేది. శతాబ్దాలుగా ఈ రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు కొనసాగాయి. మొఘలుల కాలంలో పర్షియన్ భాష మన పరిపాలన, సాహిత్యం, వాస్తుశిల్పంపై తీవ్ర ప్రభావం చూపింది. స్వాతంత్ర్యం తర్వాత 1950లో ఇరు దేశాలు అధికారికంగా దౌత్య సంబంధాలను నెలకొల్పుకున్నాయి. ఇటీవలి కాలంలో చబహార్ పోర్ట్ వంటి ప్రాజెక్టులతో ఈ బంధం మరింత బలపడింది. అమితాబ్ పోస్ట్ నేపథ్యంలో ఈ చారిత్రక సంబంధాలపై మరోసారి చర్చ మొదలైంది.

### బీసీ జనాభాలో తొలి మూడు స్థానాల్లో
## శ్రీకాకుళం, కర్నూలు, విశాఖ



అమరావతి: రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతుల వారే సగానికిపైగా ఉన్నారు. రాష్ట్ర మొత్తం జనాభా 5.31 కోట్లు కాగా, అందులో 2.68 కోట్ల మందితో బీసీల వాటా 50.59 శాతంగా ఉంది. వైకాపా ప్రభుత్వ హయాంలో 2024 ఎన్నికల ముందు (ఫిబ్రవరిలో) అప్పటి సచివాలయ సిబ్బందితో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కులగణన ద్వారా ఈ వివరాలు వెల్లడయ్యాయి. నియోజకవర్గాల వారీగానూ బీసీల్లో ఏ కులం వారు ఎంత జనాభా ఉన్నారో వివరాలు సేకరించిన అప్పటి ప్రభుత్వం.. ఆ నివేదికను బహిర్గతం చేయకుండా తొక్కిపెట్టింది. సామాజికవర్గాల వారీగా వైకాపాకు అనుకూలంగా శాసనసభ స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక కోసమే అప్పట్లో సీఎం జగన్ ఈ నివేదికను బయటపెట్టలేదని విమర్శలొచ్చాయి. తాజాగా ఈ నివేదిక వెలుగులోకి వచ్చింది. ఇటీవల కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామ సచివాలయ సిబ్బందితో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే దాదాపు పూర్తైంది. అందులోనూ బీసీ జనాభా దాదాపు ఇంతే శాతం ఉన్నట్లు తెలుస్తోంది.

బీసీల్లో 138 కులాలు

రాష్ట్రంలో బీసీలను 5 కేటగిరీలుగా విభజించారు. ఇందులో మొత్తం 138 కులాలున్నాయి. బీసీ-ఏ కింద 51, బీసీ-బీ కింద 27, బీసీ-సీ కింద ఒకటి, బీసీ-డీ కింద 45, బీసీ-ఇ కింద 14 కులాలున్నాయి.

శ్రీకాకుళం జిల్లా జనాభాలో 80.83% బీసీలే..

ఆయా జిల్లాల్లో మొత్తం జనాభాలో బీసీల శాతం పరంగా శ్రీకాకుళం తొలి స్థానంలో ఉంది. ఈ జిల్లా జనాభాలో 80.83% (19.29 లక్షలు) మంది వెనుకబడిన వర్గాలే. 76.55 శాతంతో (15.14 లక్షలు) రెండో స్థానంలో విజయనగరం, 72.73 శాతంతో (12.74 లక్షలు) మూడో స్థానంలో అనకాపల్లి జిల్లాలు ఉన్నాయి. తర్వాతి స్థానాల్లో కర్నూలు (69.18%), విశాఖ (67.07%), అనంతపురం (60.25%) జిల్లాలున్నాయి. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా పరిశీలిస్తే బీసీ జనాభా అత్యధికంగా ఉత్తరాంధ్రలోనే ఉంది. కనిష్ఠంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో బీసీల జనాభా కేవలం 3.26 శాతమే ఉంది. పోలవరం (15.16%), తూర్పు గోదావరి (29.43%), ప్రకాశం (33.91%), డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ (38.73%) జిల్లాల్లోనూ బీసీ జనాభా తక్కువే ఉంది.

84.72 లక్షల మంది బీసీ-ఏలు..

బీసీల్లో ఉపవర్గాల వారీగా పరిశీలించగా.. అత్యధికంగా బీసీ-ఏలు 84.72 లక్షల మంది ఉన్నారు. తర్వాత బీసీ-డీ (82.88 లక్షలు), బీసీ-బీ (67.42 లక్షలు), బీసీ-ఈ (32.12 లక్షలు), బీసీ-సీ (1.7 లక్షలు) వర్గాల వారున్నారు.

బీసీ-ఏ సామాజిక వర్గాలకు చెందినవారు ఎక్కువగా శ్రీకాకుళం, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఉన్నారు. బీసీ-బీ జనాభా కర్నూలు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఎక్కువగా ఉంది. బీసీ-సీ వర్గాలు పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో ఎక్కువగా ఉన్నారు. నీ బీసీ-డీ జనాభా విజయనగరం, అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లాల్లో అత్యధికంగా ఉంది. నీ బీసీ-ఈ వర్గాలు కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో ఎక్కువగా ఉన్నారు.

సంఖ్యాపరంగానూ అగ్రస్థానం శ్రీకాకుళానిదే

బీసీల జనసంఖ్య పరంగా చూసినా అగ్రస్థానం శ్రీకాకుళం జిల్లాదే. ఇక్కడ అత్యధికంగా 19.29 లక్షల మంది వెనుకబడిన తరగతుల వారున్నారు. తర్వాతి స్థానాల్లో కర్నూలు (18.85 లక్షలు), విశాఖ (15.48 లక్షలు), అనంతపురం (15.25 లక్షలు), విజయనగరం (15.14 లక్షలు), అనకాపల్లి (12.74 లక్షలు), శ్రీసత్యసాయి (12.02 లక్షలు) జిల్లాలు ఉన్నాయి. కాకినాడ, నెల్లూరు, నంద్యాల జిల్లాల్లో సుమారు 10 లక్షల చొప్పున ఉన్నారు. అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 22,878 మంది ఉండగా, పోలవరం (60,038 మంది), బాపట్ల (5.08 లక్షలు), పార్వతీపురం మన్యం (5.14 లక్షలు), మార్కాపురం (5.16 లక్షలు) జిల్లాల్లోనూ బీసీ జనసంఖ్య తక్కువగా ఉంది.

## సిగరెట్లపై పెంచిన పన్నులను పునఃసమీక్షించాలి

మొదటి పేజి తరువాయి

పొగాకుపై అధిక పన్నుల భారం వంటి కీలక అంశాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆక్వా రైతులకు ఊరట కల్పించండి..

రాష్ట్రంలో రొయ్యల మేత ధరలు విపరీతంగా పెరగడంపై ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. 2026 జనవరి నుంచి మే మధ్య కాలంలో సోయా, ఫిష్ మీల్ వంటి ముడిసరుకుల ధరలు 20 శాతానికి పైగా పెరిగాయని, దీంతో మేత తయారీ ఖర్చు కిలోకు రూ.31కి పైగా పెరిగిందని లేఖలో ప్రస్తావించారు. ముడిసరుకుల ధరలు తగ్గినప్పుడు రైతులకు ప్రయోజనం బదిలీ చేయని కంపెనీలు, ఇప్పుడు భారాన్ని మోపడం సరికాదని రైతులు వాదిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఫిష్ మీల్ ఎగుమతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని, సోయా దిగుమతులపై ఆంక్షలు సడలించాలని కేంద్రాన్ని కోరారు. మరోవైపు, పౌల్ట్రీ తరహాలో ముడిసరుకుల ధరల ఆధారంగా మేత ధరలను ప్రతి నెలా సమీక్షించే విధానాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.

పొగాకు రైతులను ఆదుకోండి..

ఇదే సమయంలో, ఎఫ్‌సీవీ పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపైనా సీఎం దృష్టి సారించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు వేర్వేరు లేఖలు రాశారు. సిగరెట్లపై జీఎస్టీ, ఎక్సైజ్ డ్యూటీని భారీగా పెంచడం వల్ల కొనుగోళ్లు మందగించాయని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. గతేడాది వేలంలో కిలోకు రూ.280 ఉన్న ప్రారంభ ధర, ఈ ఏడాది రూ.250కి పడిపోయిందని తెలిపారు. ఈ పన్నుల విధానం వల్ల 43 వేల మంది రైతులు, లక్షలాది మంది కార్మికుల జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు పెంచిన పన్నులను పునఃసమీక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని చంద్రబాబు కోరారు.

## ధాన్యం సేకరణపై ప్రభుత్వం ఫోకస్

మొదటి పేజి తరువాయి

2025-26 రబీ సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా మరియు సమర్థవంతంగా నిర్వహించేందుకు పౌరసరఫరాల శాఖ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తోంది. ఇప్పటి వరకు విజయవంతంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాలతో వ్యూహాత్మక మార్గదర్శకత్వంలో, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎలాంటి జాప్యం లేకుండా కనీస మద్దతు ధర కింద రూ.4,520 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది.

ధాన్యం సేకరణపై ప్రభుత్వం ఫోకస్

రైతులు సన్న మరియు దొడ్డు రకాల ధాన్యాన్ని భారీగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయగా, మిగిలిన 21 లక్షల మెట్రిక్ టన్నుల మేర దొడ్డురకం ధాన్యాన్ని సేకరించడం జరిగింది. ప్రస్తుతం ధాన్యం కొనుగోళు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో, భారీగా వస్తున్న ధాన్యాన్ని సేకరించేందుకు అన్ని జిల్లాల్లో కలిపి మొత్తం 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు చురుగ్గా పనిచేస్తున్నాయి. ఈ విస్తృతమైన క్షేత్రస్థాయి వ్యవస్థలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 4,350 కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 3,563 కేంద్రాలు, మరియు ఇతర అనుబంధ సంస్థల ద్వారా 662 కేంద్రాలు నడుపబడుతున్నాయి. కొనుగోలు కార్యకలాపాలు సజావుగా సాగడానికి మరియు కేంద్రాలకు వస్తున్న ధాన్యాన్ని పూర్తిగా సంరక్షించడానికి, పౌరసరఫరాల శాఖ ముందస్తుగానే ఈ కేంద్రాల వద్ద 18.6 కోట్ల గన్నీ బ్యాగ్‌లను మరియు తగిన సంఖ్యలో టార్పాలిన్లను సిద్ధంగా ఉంచింది.

ధాన్యం తరలింపునకు 11,500 వాహనాలు

క్షేత్రస్థాయిలో నిల్వల సమస్య తలెత్తకుండా మరియు కొనుగోలు కేంద్రాలు ప్రతిరోజూ కొత్త ధాన్యాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉండేలా, పౌరసరఫరాల శాఖ వేగవంతమైన రవాణా కార్యకలాపాలను అమలు చేస్తోంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జాప్యం లేకుండా నేరుగా కేంద్రాల నుండి మిల్లులకు తరలించడానికి లారీలు, ట్రాక్టర్లు, డీసీఎం (ఐజవీ)లతో కూడిన సుమారు 11,500 రవాణా వాహనాలను అందుబాటులో ఉంచింది. అంతేకాకుండా, లోడింగ్ మరియు అన్‌లోడింగ్ ప్రక్రియలను దగ్గరుండి పర్యవేక్షించడానికి, పారదర్శకతను నిర్ధారించడానికి కొనుగోలు కేంద్రాలతో పాటు మిల్లుల వద్ద కూడా ప్రత్యేక అధికారులను వ్యూహాత్మకంగా నియమించింది.

## మూడు రాష్ట్రాల్లో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టు

మొదటి పేజి తరువాయి

రైల్లో అయితే దాదాపు 15 గంటల సమయం పడుతోంది. బుల్లెట్ రైల్లో గంటకు గరిష్ఠంగా 300 కిమీ వేగంతో కేవలం మూడు గంటల్లో చేరుకునేలా హైదరాబాద్-పుణె-ముంబయి హైస్పీడ్ రైలు కారిడార్ ప్రణాళికలు తయారయ్యాయి. ఇప్పటికే సర్వే పూర్తి కాగా, తాజాగా డీపీఆర్ కూడా సిద్ధం అయిందని నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్) రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా తెలిపింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యాక బుల్లెట్ (హైస్పీడ్) రైల్లో హైదరాబాద్ నుంచి ముంబయికి కనిష్ఠంగా 2.55 గంటలు, గరిష్ఠంగా 3.13 గంటల్లో చేరుకోవచ్చని పేర్కొంది. ఈ ప్రాజెక్టులో మరో ఆసక్తికరమైన అంశం ఉంది. మహారాష్ట్ర పరిధిలోని మూడు ప్రాంతాల్లో మొత్తం 35.30 కిమీ మేర భూగర్భ మార్గం నిర్మిస్తారు. ఈ కారిడార్‌లోని ఖండాల ఘాట్ ప్రాంతంలో మొత్తం 13 చోట్ల కొండల్ని తొలిచి సొరంగాల నిర్మాణం చేపడతారు. మొత్తం దూరం 24 కిలోమీటర్లు. హైదరాబాద్‌లో మెట్రో రైలు కోసం పిల్లర్లపై నిర్మించిన ట్రాక్ మాదిరిగా హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మాణం ఉంటుంది. కొండ ప్రాంతాలు, భూగర్భంలో, నదుల మీదుగా నిర్మాణానికి ప్రతిపాదించిన ఈ హైస్పీడ్ రైలు కారిడార్‌లో అనేక విశేషాలున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాల పరిధిలో 7 హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టుల్ని ప్రకటించగా.. ఇందులో 3 హైదరాబాద్ నుంచి ఉన్నాయి. హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు సర్వే దశలో ఉండగా హైదరాబాద్-పుణె-ముంబయి ప్రాజెక్టు సర్వే పూర్తి కావడంతోపాటు డీపీఆర్‌ను సైతం ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్ సిద్ధం చేసింది. ఈ కారిడార్ మొత్తం దూరం 671 కిమీ. ఇందులో 93 కిమీ (14 శాతం)తెలంగాణలో, 121 కిమీ (18 శాతం) కర్ణాటకలో, అత్యధికంగా 457 కిమీ (68 శాతం) మహారాష్ట్రలో ఉంటుంది.

**రైలు ఆగే స్టేషన్లు..**

**తెలంగాణలో: వికారాబాద్, హైదరాబాద్ (కోకాపేట)**

**కర్ణాటకలో: కలబురిగి**

**మహారాష్ట్రలో: విఖ్రోలి, థానే, నవీ ముంబయి, లోనావాలా, పింప్రిచించ్వాడ్, పుణె, బారామతి, పంఢర్‌పుర్, సోలాపుర్**

**ఒక్కో స్టేషన్‌కు 247 ఎకరాలు...**

బుల్లెట్ రైళ్ల పరుగులో వేగమే కాదు..అవి ఆగే స్టేషన్లలోనూ ప్రత్యేకత ఉండనుంది. సాధారణ స్టేషన్ల మాదిరి కాకుండా అంతర్జాతీయ ప్రమాణాల్లో ఈ రైల్వేస్టేషన్లను నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. ఒక్కో స్టేషన్ ప్రాంగణానికి భవన నిర్మాణం, పార్కింగ్ ఇతర సదుపాయాల కోసం 247 ఎకరాల భూమి అవసరం అవుతుందని అంచనా వేశారు. పెద్దఎత్తున భూమి కావాలని ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇటీవల తొలుత రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తాజాగా సీఎస్ రామకృష్ణారావు, స్పెషల్ సీఎస్ (రవాణా, ఆర్‌అండ్‌బీ) వికాస్‌రాజ్‌తో ఆ సంస్థ అధికారులు సమావేశమైన సందర్భంలో ఈ ప్రాజెక్టు విశేషాలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారం గురించి వివరించారు. రాష్ట్రంలో తొలుత కోకాపేట, వికారాబాద్‌లలో హైస్పీడ్ స్టేషన్లను గుర్తించగా..తాజాగా శంషాబాద్ చేరింది. స్టేషన్ నిర్మించే ప్రాంతాన్ని గుర్తించాల్సి ఉంది. మొత్తంగా ఎయిర్‌పోర్ట్ సమీపంలోనే ఉంటుంది. వికారాబాద్, కోకాపేట స్టేషన్ల నిర్మాణాలు, ప్రాంగణాలకు మొత్తం 247 ఎకరాలు కావాలని ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. డిపో కోసం భారీగా భూమి కావాలని అడిగింది.

**నదులపై భారీ వంతెనలు..**

ఈ ప్రాజెక్టు మార్గంలో మొత్తం 101 వంతెనలను నిర్మించనున్నారు. ఇందులో 13 స్టీల్ వంతెనలు ఉంటాయి. ప్రధాన నదులపై 29 భారీ వంతెనలు ప్రతిపాదించారు. ములా-ముఠా నదిపై 360 మీటర్ల పొడవైన వంతెన..భీమా నదిపై 280 మీటర్ల వంతెన, బోరి నదిపై 225 మీటర్ల వంతెన నిర్మిస్తారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్యపైన అంచనాలు రూపొందించారు. ప్రారంభ సంవత్సరంలో రోజుకు 63,494 మంది..2041 నాటికి 95,050.. 2051కి 1,22,727.. 2061 నాటికి 1,52,092 మంది ప్రయాణిస్తారని అంచనా. వికారాబాద్ హైస్పీడ్ రైలు స్టేషన్‌కు 2.3 కిమీ దూరంలో రైల్వే స్టేషన్, 3 కిమీ దూరంలో వికారాబాద్ పట్టణం ఉన్నాయి. ప్రతిపాదిత స్టేషన్ ప్రాంతం భూమి ప్రైవేటుది. కోకాపేట హైస్పీడ్ రైలు స్టేషన్‌కు ప్రతిపాదిత మెట్రో రైలు స్టేషన్ (కోకాపేట నియోపోలిస్) 0.5 కిమీ దూరంలో, ఔటర్ రింగ్‌రోడ్ కేవలం 0.01 కిమీ దూరంలో, లింగంపల్లి రైల్వేస్టేషన్ 13 కిమీ దూరంలో ఉన్నాయి. ప్రతిపాదిత స్టేషన్ ప్రాంతం భూమి కొంత ప్రైవేటుది, కొంత ప్రభుత్వానిది.

**ఒక్కో రైల్లో 16 బోగీలు, 1,215 మంది ప్రయాణికులు**

ఒక్కో బుల్లెట్ రైల్లో 16 బోగీలు ఉంటాయి. ఒకేసారి మొత్తం 1,215 మంది ప్రయాణించే సామర్థ్యంతో సీట్లు ఉంటాయి. ప్రాజెక్టు ఆపరేషన్ కోసం మహారాష్ట్రలోని థానేలో ఒక భారీ బుల్లెట్ రైళ్ల డిపో, వర్క్‌షాప్‌ను..హైదరాబాద్‌లో మరో డిపోను ఏర్పాటు చేస్తారు. ముంబయిలో ఆపరేషన్ కంట్రోల్ సెంటర్‌ను ప్రతిపాదించారు

## ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవాలి

మొదటి పేజి తరువాయి

ఇరుదేశాల మధ్య సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవాలని ఈ సందర్భంగా ఇరుదేశాలు అంగీకరించాయి. భారత్--ఈయూ వ్యూహాత్మక భాగస్వామ్యం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం స్ఫూర్తితో తమ ప్రజల ప్రయోజనం కోసం కొత్త అవకాశాలను అన్వేషించాలని నిర్ణయించారు. వ్యాపారం, వాణిజ్యం, టెక్నాలజీ, రక్షణ సహా కీలక రంగాల్లో పరస్పర సహకారంపై సంప్రదింపులు జరిపారు. సహకారమే మన బలమని ఉద్ఘాటించారు. రెండో రోజుల పర్యటన నిమిత్తం నెదర్లాండ్స్ నుంచి ఆదివారం ఉదయం స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్‌కు చేరుకున్న మోదీకి ఘనస్వాగతం లభించింది. మోదీ గౌరవార్థం ఆయన ప్రయాణించిన విమానానికి స్వీడన్ ఎయిర్‌ఫోర్స్ విమానాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి. గోథెన్‌బర్గ్ ఎయిర్‌పోర్టులో మోదీకి స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్ సాదర స్వాగతం పలికారు. మోదీకి స్వాగతం పలకడానికి స్వీడన్‌లోని ప్రవాస భారతీయులు తరలివచ్చారు. మోదీ రాకను పురస్కరించుకొని నిర్వహించిన సంగీత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం మోదీ, క్రిస్టర్సన్ మధ్య ప్రతినిధుల స్థాయి భేటీ జరిగింది. ఇరు పక్షాలు ద్వైపాక్షిక సంబంధాలను సమీక్షించారు.

ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంపొందించడానికి అందుబాటులో ఉన్న నూతన మార్గాలపై చర్చించారు. హరిత పరివర్తన, కృత్రిమ మేధ(ఏఐ), వర్ధమాన సాంకేతికతలు, స్టార్టప్‌లు, సప్లై చైన్లు, రక్షణ, అంతరిక్షం, వాతావరణ చర్యలు సహా ప్రజల మధ్య సంబంధాల విషయంలో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై భారత్, నెదర్లాండ్స్ ప్రత్యేకంగా దృష్టి సారించాయి.

ప్రధాని మోదీకి 'పోలార్ స్టార్' గౌరవం

ప్రధాని మోదీ స్వీడన్ అత్యున్నత పురస్కారం 'రాయల్ ఆర్డర్ ఆఫ్ పోలార్ స్టార్, డిగ్రీ కమాండర్ గ్రాండ్ క్రాస్'అందుకున్నారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి చేసిన కృషి, దూరదృష్టి కలిగిన నాయకత్వానికి గుర్తింపుగా ఈ పురస్కారం అందజేసినట్లు స్వీడన్ యువరాణి విక్టోరియా ప్రకటించారని విదేశాంగ శాఖ తెలిపింది.

భారత్, నెదర్లాండ్స్ మధ్య ఇక వ్యూహాత్మక భాగస్వామ్యం

ద హేగ్: అంతర్జాతీయ భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో భారత్, నెదర్లాండ్స్ దేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లాయి. ఇకపై ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ నెదర్లాండ్స్‌లో పర్యటించారు. ఆ దేశ ప్రధానమంత్రి రోబ్ జెటెన్‌తో సమావేశమయ్యారు. ఇరుదేశాలు మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా రక్షణ, అరుదైన ఖనిజాలు సహా కీలక రంగాల్లో పరస్పర సహకారం కోసం 17 ఒప్పందాలపై భారత్, నెదర్లాండ్స్ సంతకాలు చేశాయి. పశ్చిమాసియా పరిణామాలపై ఇద్దరు ప్రధానమంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన సరఫరాలో అంతరాయాల వల్ల ప్రపంచదేశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వెల్లడించారు. భేటీ తర్వాత వారిద్దరూ ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు.

### సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 38కి పెంపు..
## ఆర్డినెన్స్ జారీ చేసిన రాష్ట్రపతి

మొదటి పేజి తరువాయి

సుప్రీంకోర్టులో పేరుకుపోయిన కేసుల భారాన్ని తగ్గించి, ప్రజలకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 92 వేలకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, న్యాయమూర్తుల సంఖ్యను పెంచడం ద్వారా కేసుల విచారణను వేగవంతం చేయవచ్చని కేంద్రం భావిస్తోంది. ఈ ఆర్డినెన్స్ ద్వారా 'సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) చట్టం, 1956'లోని సెక్షన్ 2ను సవరించారు. దీని ప్రకారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కాకుండా ఇతర న్యాయమూర్తుల సంఖ్య 33 నుంచి 37కు పెరిగింది. దీంతో సీజేఐతో కలిపి మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 38కి చేరింది. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరగనందున, రాజ్యాంగంలోని ఆర్టికల్ 123 కింద కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి చట్టరూపం కల్పించనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. ఈ తాజా నిర్ణయంతో ఏర్పడిన నాలుగు అదనపు న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి సుప్రీంకోర్టు కొలీజియం త్వరలో పేర్లను సిఫార్సు చేసే ప్రక్రియను ప్రారంభించనుంది.

### 'సర్'పై రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ఉద్యోగుల మీద
## నమ్మకం లేదేమో!

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల వరికి కనీస మద్దతు ధర పెంచినా.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతుల ధాన్యం ఇంకా కల్లాల్లోనే ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. 'సర్'పై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. యుద్ధం వల్ల ఇంధనం ధరలు పెరిగితే అప్రజాస్వామికమని సీఎం ఆరోపించడం సరైంది కాదన్నారు. ఆదివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. "కాంగ్రెస్ ప్రభుత్వం రైతు డిక్లరేషన్ల పేరుతో హామీలు ఇచ్చి మోసం చేసింది. రాష్ట్రంలో కనీసం ధాన్యం కొనలేని పరిస్థితి నెలకొంది. రైతులు అనేక ప్రాంతాల్లో ఆందోళనలు చేస్తున్నారు. యూపీఏ హయాంలో ధాన్యం క్వింటాకు రూ.1,300 గిట్టుబాటు ధర ఉండేది. మోదీ ప్రభుత్వం దాన్ని రూ.2,360కు పెంచింది. ధాన్యం కొనుగోలుకు ప్రతి పైసా కేంద్రమే ఇస్తుంది. రాష్ట్రంపై రూపాయి కూడా భారం పడదు. మొత్తం కేంద్రమే భరిస్తున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లు ఎందుకు ఆలస్యం చేస్తుందో చెప్పాలి. రేవంత్‌రెడ్డి సర్కారు ధాన్యం మీద బోనస్ అని చెప్పి మాట తప్పింది. రాష్ట్ర మంత్రులంతా ఒక్కో జిల్లాకు వెళ్లి కొనుగోళ్లపై దృష్టి పెట్టి రైతుల ఇబ్బందులు తీర్చాలి.

అనర్హుల ఓట్లు కచ్చితంగా తొలగిస్తారు

ఇక స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) విషయానికొస్తే ఒక్కొక్కరికి రెండు లేదా మూడు చోట్ల ఓట్లు ఉంటే గుర్తించి తొలగిస్తారు. ముఖ్యంగా రోహింగ్యాల ఓట్లు కచ్చితంగా తొలగిస్తారు. 'సర్'పై రేవంత్‌రెడ్డి అనేక విమర్శలు చేస్తున్నారు. ఓట్ల ప్రక్షాళన మోదీ వచ్చి చేయరుగా.. రాష్ట్ర అధికారులే చేస్తారు. అయినా రేవంత్‌రెడ్డికి వారిపై విశ్వాసం లేదేమో. ఇటీవల ఒక సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ఓట్లు తొలగిస్తోందని సీఎం రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారు. 'సర్' విషయంలో కేంద్రం కుట్రలు చేయాలని చూస్తోందని ఒక భారాస నేత ఆరోపించారు. అదేంటో బయట పెట్టాలని నేను సవాల్ చేస్తున్నా. పెట్రోల్, డీజిల్‌పై అప్రజాస్వామికంగా ధరలు పెంచారని సీఎం రేవంత్ మాట్లాడుతున్నారు. కానీ ఇది కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉన్న అంశం కాదు. గతంలో అంతర్జాతీయంగా ముడిచమురు ధర తక్కువ ఉన్నప్పుడు ఎక్సైజ్ డ్యూటీని కేంద్రం తగ్గించింది. రాష్ట్రాలను కూడా వ్యాట్ తగ్గించాలని కోరింది. మోదీ విజ్ఞప్తితో అనేక రాష్ట్రాలు తగ్గించాయి కూడా. దేశంలోనే అత్యధికంగా వ్యాట్ విధిస్తోంది తెలంగాణలోనే" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బండి భగీరథ్ కేసుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు కిషన్‌రెడ్డి బదులిస్తూ.. ఈ కేసులో కేంద్రం ప్రమేయం ఉండదని అన్నారు. రాష్ట్ర పోలీసులకు సంబంధించిన విషయమని, వారే దర్యాప్తు చేసి ఏ విషయమైనా చర్యలు తీసుకునే అధికారం ఉంటుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

## తిరుమల కొండల్లో పచ్చదనం.. అటవీ సంరక్షణలో



తిరుపతి: తిరుమల పుణ్యక్షేత్రం అనగానే శ్రీవారి దివ్యమంగళ స్వరూపంతో పాటు పచ్చని గిరులు కళ్లముందుకొస్తాయి. ఆ పవిత్ర శేషాచల కొండలు ఇప్పుడు పచ్చదనంతో మరింత కళకళలాడుతున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అటవీ విభాగం దశాబ్దాలుగా చేస్తున్న కృషితో ఈ ప్రాంతంలో అటవీ విస్తీర్ణం ఏకంగా 89.40 శాతానికి చేరింది. ఇటీవల విడుదలైన ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ నివేదిక (ఐఎస్ఎఫ్ఆర్) ప్రకారం అటవీ సంరక్షణలో టీటీడీ దేశంలోనే అత్యుత్తమ స్థానంలో నిలిచింది. టీటీడీ పరిధిలోని 2,719 హెక్టార్ల అటవీ ప్రాంతంలో దాదాపు 2,431 హెక్టార్లు పచ్చదనంతో నిండి ఉండటం విశేషం. 1980 నుంచి టీటీడీ అటవీ విభాగం శేషాచల అరణ్య సంపద పరిరక్షణకు, పర్యావరణ సమతుల్యతకు పెద్దపీట వేస్తోంది. డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ పర్యవేక్షణలో తిరుమల, తిరుపతిలలో రెండేసి చొప్పున మొత్తం నాలుగు ఫారెస్ట్ రేంజ్‌ల ద్వారా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేటను అరికట్టేందుకు 24 గంటల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం గస్తీ కాస్తున్నాయి. అగ్నిప్రమాదాల నివారణకు ఏటా 26.5 లక్షల చదరపు మీటర్ల ఫైర్ లైన్లను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రత్యేక బృందాలతో అప్రమత్తంగా ఉంటున్నారు. జీవ వైవిధ్య పరిరక్షణలో భాగంగా టీటీడీ ఓ కీలక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. పర్యావరణానికి హాని కలిగించే విదేశీ జాతి అకేషియా చెట్లను తొలగించి, వాటి స్థానంలో 576 హెక్టార్ల విస్తీర్ణంలో గంధం, ఎర్రచందనం, ఉసిరి, నేరేడు వంటి స్థానిక జాతి మొక్కలను నాటుతున్నారు. ఇప్పటికే 22 హెక్టార్లలో ఈ పనులు పూర్తయ్యాయి. దీనికి అవసరమైన మొక్కలను టీటీడీయే తన నర్సరీలలో పెంచుతోంది.

టీటీడీ కృషితో పచ్చని వనమైన శేషాచలం

మానవ-వన్యప్రాణి ఘర్షణల నివారణకు, జంతువుల సంరక్షణకు కూడా టీటీడీ ప్రాధాన్యత ఇస్తోంది. వేసవిలో జంతువుల దాహార్తి తీర్చేందుకు నీటి గుంతలు ఏర్పాటు చేయడం, భక్తుల భద్రత కోసం స్నేక్ రెస్క్యూ బృందాలను అందుబాటులో ఉంచడం వంటి చర్యలు తీసుకుంటున్నారు. ఆలయ అవసరాలకు శ్రీగంధం, వంటచెరకు, దర్భ వంటివి సమకూర్చడంతో పాటు, తిరుమల-తిరుపతిలలో రహదారి డివైడర్లు, ఉద్యానవనాల సంరక్షణ బాధ్యతలను కూడా అటవీ విభాగమే చూసుకుంటోంది. ప్రస్తుతం పవిత్ర వనం, దివ్య ఔషధ వనం వంటి పలు ప్రాజెక్టులతో శేషాచల పచ్చదనాన్ని మరింత పెంచేందుకు టీటీడీ కృషి చేస్తోంది.

# మహేశ్వరంలో త్రీ కే రన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన రవీందర్ రెడ్డి

**ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ 3 కే రన్ కార్యక్రమం నిర్వహించిన మహేశ్వరం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి మరియు పంచాయతీ అధికారి రవీందర్ రెడ్డి**




( నేటి శుభోదయ మహేశ్వరం మే 18:)రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో మహేశ్వరం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి మరియు పంచాయతీ అధికారి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం భాగంగా ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ : మారథాన్ ఒ ఫిజికల్ టరసీ యువతలో ఆరోగ్య చైతన్యం, క్రీడాస్ఫూర్తి, శారీరక దృఢత్వం మరియు జట్టు భావన పెంపొందించుటకు నిర్వహించబడుతున్న ప్రత్యేక కార్యక్రమానికి గ్రామ ప్రజలు, యువత, విద్యార్థులు మరియు క్రీడాభిమానులు. పెద్ద ఎత్తున పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి మరియు పంచాయతీ అధికారి రవీందర్ రెడ్డి. మహేశ్వరం గ్రామ పంచాయతీ కార్యదర్శి సుజాత. గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్. ఉప సర్పంచ్ జోరల రమేష్. తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్. అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లే బిక్షపతి. శివగంగా ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగల్ల లాజర్. మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా. బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కటికల మహేందర్ ముదిరాజ్. గ్రామపంచాయతీ సభ్యులు పోల్కం కిష్టమ్మ శ్రీశైలం. వత్తుల శాలిని సన్నీ కుమార్. ఆకుల వీరి బాబు. సున్నం సప్న కృష్ణ. జటావత్ రూకేష్ నాయక్. పిఎసిఎస్ డైరెక్టర్లు పోల్కం బాలయ్య. కడమోని ప్రభాకర్. శివగంగా ఆలయ కమిటీ డైరెక్టర్ పేయ్యల దేవేందర్. మహేశ్వరం గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కర్రెల రాములు ముదిరాజ్. కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షులు గదగూటి హరికృష్ణ ముదిరాజ్. బిఆర్ఎస్ మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మిద్దింటి సిద్దు. గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ శేఖర్. కంప్యూటర్ ఆపరేటర్ రాజు నాయక్. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం గ్రామ 10 వ వార్డు ఇంచార్జ్ కాకి మల్లేష్ ముదిరాజ్.11 వ వార్డు ఇంచార్జ్ గదగుటి జంగయ్య ముదిరాజ్. గ్రామ పెద్దలు అల్లే రవి. కాకి యాదగిరి ముదిరాజ్. మహమ్మద్ ముస్తాక్ కదిరి. మిద్దింటి ప్రభాకర్. కటికల శంకర్ ముదిరాజ్. దుద్దు కృష్ణ యాదవ్. కటికల మైసయ్య ముదిరాజ్. ఎల్జీ శ్రీశైలం. గుర్రం సత్తయ్య. గగనం ఆంజనేయులు. మహేశ్వరం గ్రామ యువకులు మిద్దింటి సిద్దు. లడ్డు నాయక్. నిమ్మగూడెం దయానంద్ గౌడ్. బొమ్మల పైన మహేష్ బాబు. గాజుల రాజు. టి నరేందర్ జి. వద్ది శ్రీశైలం తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా జరుపుకున్నారు షేక్ హాజీ బాబా మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి

## పోతర్ల సాంబయ్య యాదవ్ బాక్స్ క్రికెట్ గ్రౌండ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు



( నేటి శుభోదయ మహేశ్వరం మే 18:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో పోతర్ల సాంబయ్య యాదవ్ బాక్స్ క్రికెట్ గ్రౌండ్ ప్రారంభోత్సవం మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్. ఉప సర్పంచ్ జోరల రమేష్. మహేశ్వరం గ్రామా మాజీ సర్పంచ్ మాజీ ఎంపిటిసి సభ్యులు గంగపుత్ర సంఘం రాష్ట్ర నాయకులు కూన యాదయ్య. తెలంగాణ పద్మశాలి సంఘం వైస్ చైర్మన్ కర్నాటి మనోహర్. పిఎసిఎస్ మాజీ చైర్మన్ పోతర్ల అంబయ్య యాదవ్. మహేశ్వరం గ్రామ మాజీ సర్పంచ్ స్వర్ణగంటి ఆనందం. మహేశ్వరం గ్రామ పెద్దలు గోపాల్ రెడ్డి. ఇంద్రకంటి నరసింహ గౌడ్. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మొహమ్మద్ అబ్దుల్ జావిద్.అల్లే బిక్షపతి. గ్రామపంచాయతీ సభ్యులు ఆకుల వీరీ బాబు. సున్నం సప్న కృష్ణ. పిఎసిఎస్ డైరెక్టర్ కడమోని ప్రభాకర్. శివగంగా ఆలయ కమిటీ డైరెక్టర్ పోతర్ల తిరుపతయ్య యాదవ్. ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్. మహేశ్వరం గ్రామ ఎంపిటిసి మాజీ సభ్యులు పోతర్ల సుదర్శన్ యాదవ్. మండల్ కో ఆప్షన్ మాజీ సభ్యులు సయ్యద్ ఆదిల్ అలీ. గంగారం గ్రామ మాజీ సర్పంచ్ వీర్య నాయక్. మన్సాన్పల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ నరసింహ యాదవ్.



సేవాలాల్ దేవాలయ కమిటీ చైర్మన్ సీతారాం నాయక్. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగల్ల లాజర్. మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా. బిఆర్ఎస్ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షుడు కటికల మహేందర్ ముదిరాజ్. బిఆర్ఎస్ మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మిద్దింటి సిద్దు .బిజెపి మండల ప్రధాన కార్యదర్శి వనంపల్లి శ్రావణ్ కుమార్. బజరంగ్దళ్ అధ్యక్షులు భీమనపల్లి రాజేష్. ముదిరాజ్ సంఘం మహేశ్వరం మండల అధ్యక్షులు కాకి కుమార్ ముదిరాజ్. కురుమ సంఘం మహేశ్వరం గ్రామ అధ్యక్షులు మిద్దింటి యాదగిరి. కాంగ్రెస్ పార్టీ 10 వ ఇంచార్జ్ కాకి మల్లేష్ ముదిరాజ్.11 వ వార్డు ఇంచార్జ్ గదగుటి జంగయ్య ముదిరాజ్. గ్రామ పెద్దలు అల్లే రవి. ఎన్ టి వీరప్ప. ఇంద్రకంటి అంజయ్య గౌడ్. పులిగిల్ల రాజ చారి. గుర్రం బిక్షపతి. కటికల మైసయ్య ముదిరాజ్. గుర్రం బాలయ్య. గ్రామ యువకులు పోతర్ల సందీప్ యాదవ్. పెద్దమ్మ శ్రీకాంత్. శశి కాంత్ రెడ్డి.కూన వెంకటేష్. పోతర్ల దినేష్ యాదవ్. పోతర్ల శ్రీకాంత్ యాదవ్. సందుల ఆనంద్. లడ్డు నాయక్. పి ఎస్ వై ప్రొప్రైటర్ బబ్లు యాదవ్. పోతర్ల వారి కుటుంబ సభ్యులు తదితరులు హాజరై ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు షేక్ హాజీ బాబా మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి

## గదగూటి రాజు ముదిరాజ్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన హాజీ బాబా

**మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు**

**కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా**




( నేటి శుభోదయ మహేశ్వరం మే 18:)రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో మహేశ్వరం గ్రామానికి చెందిన దివంగత గ్రామపంచాయతీ సభ్యులు సివిల్ సప్లై వర్కర్ కీర్తిశేషులు గదగూటి కృష్ణయ్య కుమారుడు గదగుటి రాజు ముదిరాజ్ 19 వ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపీ ఘనంగా సన్మానం చేసిన మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా మాట్లాడుతూ గద గూటి రాజు ముదిరాజ్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మీరు మీ కుటుంబం ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలని ఆయురారోగ్యాలతో సిరి సంపదలతో ఉండాలని కోరుకుంటూ మీ శ్రేయోభిలాషి షేక్ హాజీ బాబా

# ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

**: జిల్లా కలెక్టర్ అంకిత్.బూర్గంపాడులో వివిధ శాఖల సమన్వయంతో మాక్ డ్రిల్ నిర్వహణ.**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 18,( నేటి శుభోదయ ),తెలంగాణ రాష్ట్రంలో విపత్తుల నిర్వహణ, వరదలు, అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు మరియు సహాయక చర్యలపై సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 11 జిల్లాల్లో నిర్వహించిన మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని రాష్ట్ర రెవెన్యూ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి హరిచందన, రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులతో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో విపత్తుల నిర్వహణ వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రాణనష్టాన్ని నివారించడమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు తక్షణ సహాయం అందించేలా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ ( ఈ ఓ సి) నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన తో కలిసి పాల్గొని, బూర్గంపాడులో నిర్వహిస్తున్న మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ వివిధ శాఖల అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం బూర్గంపాడు మండలంలోని అంబేద్కర్ నగర్, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి రెస్క్యూ, పునరావాస చర్యలను పరిశీలించారు.ఫైర్ శాఖ అధికారి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మాక్ డ్రిల్‌కు ఆరవ బెటాలియన్ టీజీఎస్పీకి చెందిన కే. శంకర్, సీఆర్పీఎఫ్ కమాండర్ రాజేష్ దోగ్రా అబ్జర్వర్లుగా వ్యవహరించారు. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలను లైఫ్ జాకెట్లు, బోట్లు సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అంబులెన్స్‌ల ద్వారా పునరావాస కేంద్రాలకు చేర్చడం, బాధితులకు తాగునీరు, భోజనం, వైద్య సేవలు, తాత్కాలిక నివాస సదుపాయాలు కల్పించడం వంటి చర్యలను డెమో రూపంలో ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో భాగంగా బూర్గంపాడు ఎస్సీ కాలనీ నుంచి 10 మంది గర్భిణీలు, 45 మంది చిన్నారులు సహా మొత్తం 200 మందిని, 26 పశువులను సురక్షితంగా బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడ బాధితులకు తక్షణ వైద్య సేవలు, ఆశ్రయం, త్రాగునీరు, ఆహార సదుపాయాలు కల్పించారు.వివిధ శాఖల అధికారులు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫైర్, రెవెన్యూ, ఇరిగేషన్, వైద్య, పశుసంవర్ధక శాఖల సిబ్బంది సమన్వయంతో సేవలు అందించారు. గజఈతగాళ్ల సహాయంతో చేపట్టే రెస్క్యూ విధానాలను కూడా ప్రాక్టికల్‌గా ప్రదర్శించారు.బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం, ఆపరేషన్ సెంటర్లు, వైద్య శిబిరాలను జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. బాధితులకు అందిస్తున్న త్రాగునీరు, భోజనం, తాత్కాలిక నివాస సదుపాయాలు, అత్యవసర వైద్య సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరాల ద్వారా అందిస్తున్న సేవలు, మందుల పంపిణీ, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు తగిన సూచనలు చేశారు. పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని కూడా పరిశీలించి, పశువులకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ సిబ్బంది (ఈఎంసి), రెవెన్యూ సిబ్బంది బాధితులకు సమన్వయంతో సేవలు అందించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ముందస్తు అప్రమత్తత, శాఖల మధ్య సమన్వయం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించవచ్చన్నారు. ఎన్‌సీసీ విద్యార్థులతో మాట్లాడి అత్యవసర పరిస్థితుల్లో వారు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. విపత్తుల సమయంలో "గోల్డె న్ అవర్"లో తీసుకునే చర్యలు ప్రాణ రక్షణకు కీలకమని, శాఖల మధ్య సమన్వయం ద్వారా తక్షణ సహాయం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు.మాక్ డ్రిల్ ద్వారా జిల్లా యంత్రాంగం అత్యవసర పరిస్థితుల్లో సమన్వయంతో, క్రమశిక్షణతో పనిచేసే సామర్థ్యాన్ని ప్రదర్శించిందని, భవిష్యత్తులో సంభవించే ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఇలాంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగకరమని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో నాగలక్ష్మి, జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, బూర్గం పహాడ్ తాసిల్దార్, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు,ఎన్ డి ఆర్ ఎఫ్,ఎస్ డి ఆర్ ఎఫ్,ఎన్ ఎన్ సి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



## ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా చిన్నంబావిలో 2కే రన్

**ఆరోగ్యమే మహాభాగ్యమని చాటి ప్రజల్లో చైతన్యం**



వనపర్తి జిల్లా చిన్నంబావి, మే 18 ( నేటి శుభోదయ):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా సోమవారం చిన్నంబావి మండల కేంద్రంలో భారీ స్థాయిలో 2కే రన్ నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఆదర్శ్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల స్థాయి ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, క్రీడాకారులు, గ్రామ ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రారంభమైన 2కే రన్ గ్రామ ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, వ్యాయామం ప్రాముఖ్యతను చాటిచెప్పడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీడీవో ఆదర్శ్ గౌడ్ మాట్లాడుతూ, ఆధునిక జీవనశైలిలో ఆరోగ్య సంరక్షణ అత్యంత అవసరమైందని పేర్కొన్నారు. ప్రతిరోజూ యోగా, రన్నింగ్, వాకింగ్ వంటి శారీరక వ్యాయామాలను అలవాటు చేసుకుంటే శరీర దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ శారీరక చైతన్యంపై దృష్టి పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ రామస్వామి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామ కార్యదర్శులు, 108 సిబ్బంది, అంగన్ వాడి టీచర్స్ వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక ప్రమాధాలపై విజయవంతంగా ముగిసిన మాక్ ఎక్సర్ సైజ్

**నిశితంగా పర్యవేక్షణ చేసిన అదనపు కలెక్టర్, అదనపు ఎస్పీ**



నేటి శుభోదయ, సంగారెడ్డి ప్రతినిధి :పాశమైలారం లోని బయోకాన్ లిమిటెడ్ లో కొనసాగిన మాక్ డ్రిల్ ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించిన రెస్క్యూ బృందాలు అత్యవసర సమయాల్లో అప్రమత్తత ద్వారా నష్టాన్ని నివారించవచ్చు ... అదనపు కలెక్టర్ పాండు, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి సంగారెడ్డి, పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించిన సమయాలలో చేపట్టాల్సిన తక్షణ చర్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల విషయంలో సన్నద్ధతను తెలుసు కునేందుకు వీలుగా సోమవారం సంగారెడ్డి జిల్లాలోని బయోకాన్ లిమిటెడ్ పాశమైలారంలో చేపట్టిన మాక్ ఎక్సర్ సైజ్ విజయవంతంగా పూర్తయింది.అదనపు కలెక్టర్ పాండు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ మాక్ డ్రిల్ జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సమాయత్తం అయి ఉందన్న విషయాన్ని ప్రయోగాత్మకంగా తెలిసింది. విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేలా మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా చేపట్టిన సహాయక చర్యలు వాస్తవికతను తలపించేలా ఉన్నాయి. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ, పారిశ్రామిక ప్రమాదాల సమయాలలో ఏవిధంగా వ్యవహరించాలన్నది ఆచరణాత్మక రూపంలో చేసి చూపించారు. అంబులెన్స్ లు,అగ్నిమాపక శకటాలు, వైద్య బృందాలు, పోలీస్, రెవిన్యూ, ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు చేపట్టిన సహాయక చర్యలు విపత్తుల నిర్వహణపై సన్నద్ధతను చాటి చెబుతూ ప్రజల్లో, పరిశ్రమ కార్మికుల్లో నమ్మకాన్ని పెంపొందింపజేశాయి. ఆయా శాఖల అధికారులతో పాటు ఎస్.డీ ఆర్ ఎఫ్ బృందం మాక్ డ్రిల్ విజయవంతానికి దోహదపడ్డారు. పోలీస్, ఫైర్, రెవెన్యూ, , హెల్త్, విద్యుత్, పరిశ్రమలు తదితర అన్ని శాఖలు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ మాక్ ఎక్సర్ సైజ్ ను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో అప్రమత్తతతో నష్టాన్ని నివారించవచ్చని అన్నారు. అన్ని శాఖల అధికారులు, కంపెనీ యాజమాన్యం, ఎన్ డీ ఆర్ ఎఫ్, ఉద్యోగుల సమన్వ యంతో మాక్ డ్రిల్ విజయవంతమైందన్నారు.అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ, కంపెనీలో ఏర్పాటు చేసిన ఫైర్ ప్రొటెక్షన్ సిస్టమ్ సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. ఏ కంపెనీలోనైనా ప్రమాదం సంభవించిన వెంటనే సంబంధిత అధికారులు పోలీసు శాఖకు సమాచారం అందజేయాలని సూచించారు. అలాగే, కంపెనీ యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టడంతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖలకు వెంటనే సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.ప్రమాదం జరిగిన తొలి దశలో వేగంగా స్పందించడం వల్ల ప్రమాద తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చని ఆమె తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది , ఆయా బృందాలు సమన్వయంతో పనిచేయడం వల్ల మాక్ డ్రిల్ విజయవంతంగా






నిర్వహించగలిగామని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రాజేందర్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు, పోలీస్ వైద్య ఆరోగ్య, పరిశ్రమలు రెవిన్యూ , విద్యుత్ శాఖ ల అధికారులు, బయోకాన్ కంపెనీప్రతినిధులు,కార్మికులు , తదితరులు పాల్గొన్నారు.

## హస్తం... వ్యస్థం- పాత - కొత్త వారి మధ్య ఆదిత్య పోరు

**– వర్గపోరుతో పంచాయతీల్లో ఓటమి**

**– బలం ఉన్నా చే జార్చుకున్న ఉపసర్పంచ్, వైస్ చైర్మన్ పదవులు**

ఖమ్మం, నేటి శుభోదయ ::: పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లి మండలంలో అధికార కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు బయటకు కనిపించకున్నా లోలోపల అంతర్మథనం తీవ్రంగా సాగుతోంది. మండలంలో అధికార కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు అధికమవుతున్నాయి. బయటకు బలంగానే కనిపిస్తున్నా లోలోపల గ్రూపు రాజకీయాలు సంస్థాగత లోపాలను బట్టబయలు చేస్తున్నాయి. పార్టీ లో పాత, కొత్త వర్గాల మధ్య ఆధిపత్య పోరు నడుస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ మండలం నుంచి అధికార కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ లభించింది. తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. మండలంలోని నాలుగు మేజర్ గ్రామ పంచాయతీల్లో ఓటమి పాలైంది. నేలకొండపల్లి గ్రామ పంచాయతీలో వార్డు సభ్యుల బలం ఉన్నప్పటికీ ఉపసర్పంచ్ చేజేతులా వదులు కున్నారు. దీంతో పాటు మొన్న నేలకొండపల్లి సొసైటీ లో వైస్ చైర్మన్ పదవిని కాపాడుకోలేక సతికలపడ్డారు. సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకొని పనిచేస్తున్న సీనియర్లకు ఇప్పటికీ నామినేటెడ్ పదవుల్లో బెర్తులు దక్కకపోవడం మండల ముఖ్యనేతలకు తలనొప్పిగా మారింది. సామాజిక కూర్పు, సేవకు తగ్గ అవకాశాలు దక్కడం లేదని సొంత పార్టీలోనే జోరుగా చర్చ సాగుతోంది. చాలాకాలంగా పార్టీని అంటిపెట్టుకొని సేవ చేసినా పార్టీ లో తమకు గుర్తింపు ఇవ్వడం లేదంటూ అధికార పార్టీ నాయకులు అలకలు పూనడం మొదలుపెట్టారు. మండల స్థాయిలోనే సీనియర్ నాయకుల మధ్య సమన్వయ లోపం ఉండటంతో ఆ ప్రభావం గ్రామీణ క్యాడర్ పై పడుతోంది. వర్గవిభేదాలు తారాస్థాయికి చేరితే సొంత పార్టీలోనే సమీకరణలు మార్చేందుకు అసంతృప్తులు కీలకంగా వ్యవహరించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. సుదీర్ఘ ప్రజాపోరాటం తర్వాత కాంగ్రెస్ పార్టీకి అధికారం దక్కగా, గ్రామ స్థాయిలో నెలకొన్న ఈ చీలికలు పార్టీకి నష్టం చేకూర్చే ప్రమాదం ఉందని సీనియర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో హస్తం గెలిచి పార్టీ మండలంలో బలంగా నిలవాలంటే గ్రామీణ ప్రాంతాల్లోని కీలక నేతల అలకలను బుజ్జగించి, సమన్వయ వాతావరణం సృష్టించాల్సిన అవసరం ఉందని పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా గత అసెంబ్లీ, ఎన్నికల్లో విజయ దుందుభి మోగించిన హస్తం పార్టీ రాబోయే ఎన్నికల్లో గెలిచి నిలవాలంటే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంటనే కలుగజేసుకొని మండలంలో వర్గ విభేదాల పంచాయతీని సమసిపోయేలా చర్యలు తీసుకోవాలని పార్టీలోని కీలక నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు. లేకుంటే సంస్థాగత లోపాలు రాబోయే ఎన్నికల్లో విజయానికి శాపాలుగా మారడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## శాంతియుత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి

**మత పెద్దలతో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ**

**మీటింగ్లో కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ**




కొత్తగూడెం, నేటి శుభోదయ ::: శాంతియుత వాతావరణంలో పండుగలను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ అన్నారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్ అండ్ ఎం ఫంక్షన్ హాలు నందు పట్టణంలోని మతపెద్దలతో పీస్ కమిటీ మీటింగ్ ను నిర్వహించారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పండగలను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.ప్రజలంతా పండుగలను మతసామరస్యంతో జరుపుకునే విధంగా ఆయా మతాల పెద్దలు ప్రజల్లో సమన్వయం ఏర్పడేలా చేయాలన్నారు. పండుగ ఏ మతానిది అయిన సామరస్యత చాలా మంచి సంబంధాలను పెంపొందిస్తుందన్నారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో జరిగేలా మత పెద్దలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని, ఎవరైనా గొడవలు సృష్టించేలా వ్యవహరిస్తే వెంటనే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కొత్తగూడెం పట్టణంలోని అన్ని మతాల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ పీస్ కమిటీ సమావేశంలో కొత్తగూడెం టూ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రతాప్,చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, వన్ టౌన్ సీఐ కరుణాకర్, త్రీ టౌన్ సీఐ ఇంద్రాసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు : ఎస్సై చింతకాని



చింతకాని, నేటి శుభోదయ ::: రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకొని శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సరిహద్దుల్లో బాస్వపురం రోడ్డు చెక్ పోస్టులో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చింతకాని ఎస్సై వీరేందర్ తెలిపారు. ముఖ్యంగా అక్రమ పశు రవాణాకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా తక్షణమే పోలీసులకు తెలియజేయాలి తప్ప, ఏ పరిస్థితుల్లోనూ నిందితులపై ప్రత్యక్ష దాడులకు పాల్పడి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని స్పష్టం చేశారు.

## వేంసూర్ మండలం హనుమతండా చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ నిర్వహిస్తున్న వేంసూరు ఎస్సై కవిత







వేంసూరు, నేటి శుభోదయ ::: బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ రవాణాను అరికట్టేందుకు హనుమతండా లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న వేంసూరు ఎస్సై కవిత.పశువుల అక్రమ రవాణాపై 24/7 నిఘా ఉంటుందన్నారు. పశువులను తరలించేటప్పుడు సరైన ధృవీకరణ పత్రాలు కలిగి ఉండటం తప్పనిసరన్నారు.

## జూన్ 1 వ తేదీన 'గురుడు' రాశి మార్పు తో శుభఫలితాలు

**– మిథునం నుంచి కర్కాటకం లోకి 'గురుడు'**




ఖమ్మం, ఇల్లందు, నేటి శుభోదయ ::: నవగ్రహాలలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న, ధన, గౌరవ కారకుడైన గురుడు జూన్ 1 వ తేదీ రాత్రి గం. 1 : 50 ని. లకు మిథున రాశి నుంచి కర్కాటక రాశి లోకి ప్రవేశిస్తాడని సీనియర్ జర్నలిస్ట్, జ్యోతిష్య పండితులు ఎస్ వి సూర్యనారాయణ తెలిపారు. గురుడు ఉచ్చ స్థానమైన కర్కాటక రాశిలో ప్రవేశించటం వలన ఐదు రాశుల జాతకులకు శుభఫలితములు కలుగుతాయని ఆయన అన్నారు. గోచారరీత్యా గురుడు జన్మరాశి నుండి 2, 5, 7, 9, 11 స్థానాలలో సంచరించునపుడు శుభ ఫలితాలు ఇస్తాడని ; మిథున, కన్య, వృశ్చిక, మకర, మీన రాశి జాతకులకు గురుగ్రహ రాశిమార్పు వల్ల మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సంవత్సరంలో గురుడు రాశి మార్పు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని వివరించారు. శని ఈ సంవత్సరమంతా మీన రాశిలో సంచరిస్తున్నాడని, 2026 డిసెంబర్ 5 వ తేదీ వరకు రాహువు కుంభరాశిలోను, కేతువు సింహారాశిలోను సంచరించునని, డిసెంబర్ 5 నుండి రాహువు మకర రాశిలో ప్రవేశించునని, కేతువు కర్కాటక రాశిలో ప్రవేశించునని సూర్యనారాయణ తెలిపారు.

## డిజాస్టర్ మేనేజ్ మెంట్ మాక్ డ్రిల్ లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు



ఖమ్మం, నేటి శుభోదయ ::: వరదలు,ప్రమాదాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు, విపత్కర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో తెలియజేసే రాష్ట్రస్థాయి డిజాస్టర్ మేనేజ్మెంట్ మాక్ డ్రిల్ శిక్షణా కార్యక్రమంలో సోమవారం ఖమ్మం జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు (యువ ఆపద మిత్రలు)పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ హాస్పిటల్ ఖమ్మం నందు జరిగింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా రెవెన్యూ అధికారి యన్. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ఇలాంటి అనేక సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గతంలో ఖమ్మం జిల్లా నుండి 87 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉస్మానియా యూనివర్సిటీలో ఆపదమిత్ర శిక్షణ పొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో పాటు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆపదమిత్ర కోఆర్డినేటర్ ఖమ్మం జిల్లా ఎన్ఎస్ఎస్ కన్వీనర్ డాక్టర్ యన్. శ్రీనివాసరావు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు పిచ్చయ్య, డాక్టర్ స్వాతి, రాజేశ్వరరావు, వివిధ కళాశాలల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 30 ఫిర్యాదుల స్వీకరణ

**సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు జోనల్ కమిషనర్ ఆదేశాలు**



నేటి శుభోదయ :మల్కాజ్గిరి, మే 18: మల్కాజ్గిరి జోనల్ కార్యాలయంలో ఆదివారం జోనల్ కమిషనర్ శ్రీ సంచిత్ గంగ్వార్, ఐఏఎస్ అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి మొత్తం 30 ఫిర్యాదులను స్వీకరించారు.వాటిలో మల్కాజ్గిరి సర్కిల్‌కు చెందినవి 16, మౌలాలి 7, బోయిన్‌పల్లి 1, ఆల్వాల్ 4, కీసర 2 ఫిర్యాదులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని జోనల్ కమిషనర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, డీడీ యూబీడీ బి. శ్రీధర్‌రావు, డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇంజనీర్ పద్మలత, వెటర్నరీ అధికారి సంజీవ్ రెడ్డి, ఏసీపీ వి.బి. శ్రీనివాస్‌రావు, ఏఎంసీ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వడివడిగా జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ

**మౌలాలి--మల్కాజ్గిరిలో ఎన్యూమరేటర్లతో విస్తృత స్థాయి ఏర్పాట్లు**



నేటి శుభోదయ :మల్కాజ్గిరి, మే 18: కేంద్ర ప్రభుత్వం ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జనాభా లెక్కల సేకరణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు మౌలాలి--మల్కాజ్గిరి ప్రాంతాల్లో వేగంగా కొనసాగుతున్నాయి. కోవిడ్ పరిస్థితుల కారణంగా 2021లో జరగాల్సిన సెన్సస్ ప్రక్రియ వాయిదా పడగా, ప్రస్తుతం సెన్సస్--2027 కార్యక్రమానికి అధికారులు విస్తృత స్థాయిలో చర్యలు చేపడుతున్నారు.జనాభా వివరాల సేకరణలో భాగంగా ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి సంబంధించిన హెచ్ఎల్‌బీ (హౌస్ లిస్టింగ్ బ్లాక్)లను సిద్ధం చేసి, 34 రకాల ప్రశ్నలకు సంబంధించిన వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయనున్నారు. ఈ క్రమంలో మౌలాలి, మల్కాజ్గిరి ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఎన్యూమరేటర్లు చేరుకుని విధులు ప్రారంభించారు.సెన్సస్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు ప్రజలు సహకరించాలని సెన్సస్ సూపర్‌వైజర్ విలాస్‌రావు విజ్ఞప్తి చేశారు.

# ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతం

**– ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం**

**– హైదరాబాద్‌లో భారీ విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి**




హైదరాబాద్, నేటి శుభోదయ ::: ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధి కారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి



పొంగులేటి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్ డిఎంఏ) సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు.ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గోల్డెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో, సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తుచేశారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి--కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు.ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో అత్యుత్తమ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు.మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ ,జిల్లా అధికారులను మంత్రి అభినందించారు.రాష్ట్రంలో జరుగుతున్న ఈ ప్రదర్శనలు కేవలం ముందస్తు సన్నద్ధతలో భాగంగా నిర్వహిస్తున్న మాక్ డ్రిల్‌లేనని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు ఎల్లప్పుడూ బాధ్యతాయుతమైన, నిజమైన సమాచారమే చేరాలని, పుకార్లను నమ్మవద్దని ఆయన కోరారు. ఈ భారీ మాక్ డ్రిల్ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు. వీరితో పాటు పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ , రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్ఎంసీ , హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశుసంవర్ధక, వెటర్నరీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మాక్ డ్రిల్‌ను విజయవంతం చేశారు.



## మాజీ కార్పొరేటర్ నాగండ్ల కోటి దంపతులను సన్మానించిన పారిశుద్ధ్య కార్మికులు



ఖమ్మం, నేటి శుభోదయ ::: 5వ డివిజన్, 6వ డివిజన్‌లలో గత 10 సంవత్సరాలుగా పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అనేక కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందిన 6వ డివిజన్ కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరావు ని వారి సతీమణి శైలజ ని పారిశుద్ధ కార్మికులు ఘనంగా సన్మానించారు.ఈ నెల 7వ తేదీతో కార్పొరేటర్ పదవీకాలం ముగిసిన సందర్భంగా గత పదేళ్లుగా డివిజన్లలో అభివృద్ధికి చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ పారిశుద్ధ కార్మికులు ఈ సన్మాన కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.డివిజన్ అభివృద్ధిలో కార్పొరేటర్ కోటి ఎల్లప్పుడూ ముందుండి, కార్మికులతో సమన్వయంగా పనిచేస్తూ రెండు డివిజన్‌లను పరిశుభ్రంగా మరియు అభివృద్ధి దిశగా తీసుకెళ్లారని కార్మికులు తెలిపారు. పారిశుద్ధ్యం , సంక్షేమం, సమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో నాగండ్ల కోటేశ్వరావు ప్రత్యేక శ్రద్ధ చూపారని కొనియాడారు.ఇటు కార్పొరేటర్ అటు పారిశుద్ధ కార్మికులు పరస్పర సహకారంతో పనిచేయడం వల్లే 5వ, 6వ డివిజన్‌లు ఆదర్శ డివిజన్‌లుగా నిలిచాయని కార్యక్రమంలో పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కార్మికులు పుష్పగుచ్ఛాలు అందించి దంపతులను సత్కరించి తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ జవాన్ రామకృష్ణతో పాటు పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

## వికలాంగులకు 5 శాతం కోటా ప్రకారం ఇండ్లు మంజూరు చేయాలి



నేటి శుభోదయ :మల్కాజిగిరి , మే 18: వికలాంగులకు 5 శాతం జీఓ ప్రకారం గృహాలు మంజూరు చేయాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సమితి జిల్లా అధ్యక్షుడు ఎన్. వినయ్ నేతృత్వంలో ప్రతినిధులు ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లగా, ఆర్డీఓ అందుబాటులో లేకపోవడంతో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం. శ్రీనివాస్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న వికలాంగులకు ఇప్పటికీ ఇండ్లు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో కూడా దరఖాస్తులు చేసి రెండేళ్లు గడిచినా పరిష్కారం లభించలేదన్నారు. వికలాంగులు, వితంతువులు అద్దె ఇళ్లలో నివసిస్తూ తక్కువ ఆదాయాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొంతమంది కేవలం పెన్షన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు.ఇప్పటికే గృహాలు పొందిన వారి పేర్లతో మళ్లీ దరఖాస్తులు చేసిన ఘటనలపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన వికలాంగులకు మాత్రమే గృహాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలి

**: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్– అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమైన పత్రాలను వాటర్ ప్రూఫ్ జిప్ బ్యాగ్‌లలో భద్రపరచుకోవాలి– వర్షాకాలం సీజన్‌కు ముందస్తు సన్నద్ధతలో భాగంగా విజయవంతంగా ఫ్లడ్ మాక్ ఎక్సర్సైజ్ నిర్వహణ**

**– మున్నేరు వద్ద నిర్వహించిన మాక్ డ్రిల్, ఎవాక్యుయేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్**



ఖమ్మం, నేటి శుభోదయ ::: వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలని, విపత్తుల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు జిల్లా యంత్రాంగాన్ని మాన్సూన్ సీజన్‌కు పూర్తి స్థాయిలో సిద్ధం చేసేందుకు చేపట్టిన ఫ్లడ్ మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. జిల్లాలోని మున్నేరు పరివాహక ప్రాంతంలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్.డి.ఎం.ఏ) మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించిన వరద ప్రమాదాల మాక్ ఎక్సర్సైజ్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వరదల వంటి విపత్తుల సమయంలో అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే ప్రాణనష్టం నివారించవచ్చని అన్నారు. సాధారణంగా ప్రజలు నీరు కళ్లకు కనిపించే వరకు ఇళ్లను ఖాళీ చేయరని, ఈ ధోరణిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు అధికారికంగా ఎవాక్యుయేషన్ సూచనలు ఇచ్చినప్పుడు ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని సూచించారు. వర్షాకాలంలో సంభవించే అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుండి సమాచారం అందిన వెంటనే వివిధ శాఖలు ఏ విధంగా స్పందించాలి, ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, రెస్క్యూ బృందాలు ఎలా పనిచేయాలి, రిలీఫ్ క్యాంపులను ఎలా నిర్వహించాలి వంటి అంశాలపై స్టెప్ బై స్టెప్ విధానంలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీస్, టిఎస్టిడి, అగ్నిమాపక, పశుసంవర్ధక శాఖ, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విపత్తు సమయంలో చేపట్టాల్సిన చర్యలపై సాధన నిర్వహించి నట్లు తెలిపారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవచ్చున్నారు.అంతకుముందు మాక్ ఎక్సర్సైజ్ లో భాగంగ వరదల కారణంగా మున్నేరు పరివాహక ప్రాంతం ముంపుకు గురవుతుందని సమాచారం అందుకున్న జిల్లా కంట్రోల్ రూమ్ సంబంధిత అధికారులను, రెస్క్యూ బృందాలను అప్రమత్తం చేసింది. స్థానికంగా ఉన్న ఆపద మిత్ర వాలంటీర్ల సహకారంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, రామ్ లీలా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి చేర్చడం జరిగింది. రామ్ లీలా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రిలీఫ్ క్యాంప్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్, అక్కడ బాధితులకు అందించాల్సిన ఆహారం, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. వరదల సమయంలో ప్రజలు ముఖ్యమైన పత్రాలు, ఆభరణాలు కోల్పోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్‌లు, భూ పత్రాలు వంటి ముఖ్యమైన డాక్యుమెంట్లు, విలువైన వస్తువులను వాటర్ ప్రూఫ్ జిప్ బ్యాగ్‌లలో సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సమయంలో వెంట తీసుకుని వెళ్లేందుకు ప్రతి కుటుంబం ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని అన్నారు.ప్రజల్లో విపత్తుల నిర్వహణపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక అవగాహన వీడియోలు రూపొందించి వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం జనరల్ ఆస్పత్రి వద్ద వరదలలో ఎవరైనా చిక్కుకుంటే వారిని సంరక్షించి వైద్య సేవలు అందించేలా మాక్ ఎక్సర్సైజ్ చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్డిఆర్ఎఫ్ 6వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ బి. మరియాదాస్, ఎన్డీఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ఏఎంవిఐ, టీజీ ఎన్పిడిసిఎల్, వైద్య, ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖ, మునిసిపల్, రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్, సంబంధిత శాఖల అధికారులు, రెస్క్యూ బృందాలు, ఆపద మిత్ర వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



## బాసరలో వైభవంగా శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి మాసోత్సవం

**ప్రత్యేక పూజలు, హోమాలు, భక్తి సంగీత కార్యక్రమాలతో ఆధ్యాత్మిక సందడి**



నేటి శుభోదయ :నేరెడ్ మెట్, మే,18: శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయ సమీపంలోని శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమంలో నిర్వహించిన మాసోత్సవం వైభవంగా జరిగింది. కోటి పార్థివలింగ స్తూప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దీపారాధన, కలశస్థాపన, పుణ్యాహవచనం, లక్ష్మీ గణపతి పూజలు, వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన, కోటి పార్థివలింగ సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలకు మహా రుద్రాభిషేకం, కుంకుమార్చన, గణపతి, నవగ్రహ, రుద్ర, సరస్వతి హోమాలు, భూదాన సంకల్ప పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా హైదరాబాద్ మల్కాజ్గిరి ఆనంద్‌బాగ్‌కు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు, కేశవ లహరి హౌస్ ఆఫ్ మ్యూజిక్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గొల్లమూడి శారద సాగరి తన శిష్య బృందంతో కలిసి భక్తి సంగీత కళార్చన నిర్వహించి ఆకట్టుకున్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాథ శర్మ దంపతులు బ్రాహ్మణ సువాసిని పూజలు నిర్వహించి కళాకారులను ఘనంగా సత్కరించారు. ప్రతి నెల మూడో ఆదివారం మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు నిర్మల అంబికానాథ శర్మ తెలిపారు. నృత్య ప్రదర్శనల్లో పాల్గొనదలిచిన నాట్య గురువులు, సంస్థలు 9948332032 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వక్త శారదా రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆళ్లపాడు అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ప్రచారం

**కాంగ్రెస్ నాయకుల తప్పుడు ఆరోపణలు ఖండించిన సర్పంచ్ నాగేశ్వరరావు**

**"గ్రామ అభివృద్ధే నా లక్ష్యం... రాజకీయాల కోసం గ్రామాన్ని అశాంతికి గురిచేయొద్దు"డ్రైనేజీ, వీధి దీపాలు, మంచినీటి సమస్యల పరిష్కారంలో వేగంగా చర్యలు.40 బుర్రలతో మురుగు నీటి సమస్యకు చెక్...గ్రామంలో కళకళలాడుతున్న వీధిలైట్లు"సోషల్ మీడియాలో అసత్య ప్రచారం ఆపాలి"**



నేటి శుభోదయ :రాథోడ్, బోనకల్ , మే 18:మండల పరిధిలోని ఆళ్లపాడు గ్రామపంచాయతీపై, గ్రామ సర్పంచ్‌పై కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు వార్డు సభ్యులు, నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని గ్రామ సర్పంచ్ తెల్లబోయిన నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. గ్రామాభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు కావాలనే రాజకీయ దురుద్దేశంతో సోషల్ మీడియాను వేదికగా చేసుకుని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్పంచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ... గత రెండు సంవత్సరాల పాటు పాలకవర్గం లేకపోవడంతో గ్రామంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని తెలిపారు. గ్రామంలో మురుగు నీరు పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని, వీధి దీపాలు లేక రాత్రివేళ గ్రామం అంధకారంలో మగ్గేదని గుర్తుచేశారు. కొత్త పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామ పరిస్థితిని మార్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. డ్రైనేజీ మురుగు నీటిని బయటకు పంపించేందుకు గ్రామంలో 40 బుర్రలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. వీధి దీపాల మరమ్మతులు చేపట్టి గ్రామమంతా వెలుగులతో కళకళలాడేలా చేశామని పేర్కొన్నారు. అలాగే గ్రామంలో మంచినీటి సమస్యను 95 శాతం వరకు పరిష్కరించామని, పనిచేయని చేతిపంపులను మరమ్మతు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. గతంలో డీజిల్ లేక తిరగని చెత్త బండి ఇప్పుడు ప్రతి వార్డులో తిరుగుతూ పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరుగుతోందని తెలిపారు. గ్రామ అభివృద్ధిని చూసి అసహనం చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు కావాలనే గ్రామంలో లేని సమస్యలను ఉన్నట్లుగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, అవసరమైతే బహిరంగ చర్చకు కూడా సిద్ధమని సవాల్ విసిరారు. గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రతిరోజూ అందుబాటులో ఉంటున్నారని, అయినప్పటికీ కావాలనే సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ అధికారులను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గ్రామపంచాయతీ సమావేశం నిర్వహించి మెమోరాండం కూడా స్వీకరించామని, అదే రోజు పెన్షన్లకు సంబంధించిన ఫోటోలను తీసుకుని వేరే విధంగా ప్రచారం చేయడం దురుద్దేశపూరిత చర్య అని మండిపడ్డారు. గ్రామ అభివృద్ధే తన లక్ష్యమని, రాజకీయ ఆరోపణల కంటే ప్రజాసేవకే ప్రాధాన్యత ఇస్తానని సర్పంచ్ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ బండి సైదమ్మ, వార్డు సభ్యులు అల్లిక కబ్బయ్య, షేక్ రేష్మా, షేక్ చంద్, సాహెబ్ కిరణ్, షేక్ శరీఫ్, పూర్ణయ్య, సంగీత, బండి నాగేశ్వరరావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మౌలాలి డివిజన్‌లో రూ.64 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



నేటి శుభోదయ :నేరెడ్ మెట్ , మే 18: మల్కాజిగిరి లోని అన్ని డివిజన్లో సమగ్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారంమల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మౌలాలి డివిజన్ పరిధిలోని సిలికాన్ బేకరీ ఆఫీసర్స్ కాలనీ, షఫీ నగర్ మరియు సాదుల్లా నగర్ ప్రాంతాలలో రూ.64 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో భాగంగా సిలికాన్ బేకరీ ఆఫీసర్స్ కాలనీలో రూ.36 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు, అలాగే షఫీ నగర్ మరియు సాదుల్లా నగర్ ప్రాంతాలలో రూ.28 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా ఆఫీసర్స్ కాలనీలోని పార్వతి నగర్‌లో గల శ్రీ పంచవటి క్షేత్రం ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే షఫీ నగర్‌లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, డెడ్ ఎండ్ ప్రాంతంలో ర్యాంపు మెట్లు నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యే గారిని విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందజేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, అమీనుద్దీన్, వంశీ ముదిరాజ్, ఉస్మాన్, మారుతి ప్రసాద్, ఇబ్రహీం, భాగ్యనంద్ రావు, ఆదినారాయణ, మహేష్, హరీష్, సంపత్ యాదవ్, బాలకృష్ణ, నర్సింగ్ రావు, దినేష్, సందీప్, లక్ష్మణ్, నవాబ్ తదితరులు, బీఆర్ఎస్ కార్యకర్తలు మరియు స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఈ-ఫార్మసీల అక్రమాలపై ఆగ్రహం

**దేశవ్యాప్తంగా ఈనెల 20న మెడికల్ షాపుల బంద్.తహసీల్దార్, ఎస్సైలకు వినతిపత్రం అందజేసిన బోనకల్--చింతకాని మెడికల్ అసోసియేషన్ సభ్యులు**



నేటి శుభోదయ :రాథోడ్, బోనకల్, మే 18:దేశవ్యాప్తంగా ఈనెల 20న నిర్వహించనున్న మెడికల్ షాపుల బంద్‌కు మద్దతుగా బోనకల్, చింతకాని మండలాల మెడికల్ షాపుల యజమానులు సోమవారం బోనకల్ తహసీల్దార్ మరియు ఎస్సైలకు వినతిపత్రం సమర్పించారు. బోనకల్ మండల మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ ఈ-ఫార్మసీల అనియంత్రిత నిర్వహణ, 28-08-2018 నాటి 817(ఈ) నోటిఫికేషన్ ప్రభావం, అలాగే పెద్ద కార్పొరేట్ సంస్థలు అమలు చేస్తున్న దోపిడీ ధరల విధానం వల్ల చిన్న, మధ్య తరహా మెడికల్ షాపుల యజమానులు తీవ్ర



ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ఔషధ విక్రయాలపై సరైన నియంత్రణ లేకపోవడం వల్ల ప్రజారోగ్య భద్రతకే ప్రమాదం ఏర్పడుతోందని, ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో కుటుంబాలు మెడికల్ షాపులపై ఆధారపడి జీవిస్తున్న నేపథ్యంలో ఈ పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోందన్నారు. స్థిరపడిన ఔషధ పంపిణీ వ్యవస్థను కాపాడాలని, అక్రమ ఈ-ఫార్మసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండల మెడికల్ షాపుల అసోసియేషన్ అధ్యక్షుడు గమిడి సైదులు (శ్రీ సాయి మెడికల్ స్టోర్స్--రావినూతల), ట్రెజరర్ సుగ్గల వెంకట వీరబ్రహ్మంజనేయులు (లక్ష్మీ వెంకటేశ్వర మెడికల్ స్టోర్స్--బోనకల్), సభ్యులు గమిడి కొండలు (శ్రీ వెంకటేశ్వర మెడికల్ స్టోర్స్--రావినూతల), వెంకటేశ్వరరావు (శ్రీ వెంకట సాయి మెడికల్ స్టోర్స్--జానకీపురం), షేక్ ఖాసీం (సుల్తాన్ మెడికల్ స్టోర్స్--బోనకల్) తదితరులు పాల్గొన్నారు.

## యువత టూరిజం రంగంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**యువ టూరిజం క్లబ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అంకిత్.**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 18,( నేటి శుభోదయ ),ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మే 18 నుండి 23 వరకు నిర్వహించనున్న టూరిజం వారోత్సవాల సందర్భంగా "యువ టూరిజం క్లబ్" పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యాటక రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, యువత టూరిజం రంగంపై అవగాహన పెంపొందించుకొని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు యువతలో పర్యాటక ప్రదేశాల పట్ల ఆసక్తి పెంచడంతో పాటు వారసత్వ సంపద పరిరక్షణపై అవగాహన కల్పిస్తాయని తెలిపారు. టూరిజం వారోత్సవాల సందర్భంగా జిల్లాలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మే 19న పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్ట్ వద్ద టూరిజం అవేర్‌నెస్ డ్రైవ్, మే 20న లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండ రామవరం బౌద్ధ రాక్ కేవ్స్ వద్ద హెరిటేజ్ వాక్, మే 21న జిల్లాలోని యూట్యూబర్లతో సమావేశం, మే 22న బౌద్ధ రాక్ కేవ్స్ ప్రాంతంలో స్వచ్ఛత డ్రైవ్, మే 23న పాల్వంచలోని ఐడాక్‌లో బ్రాండ్ కిట్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు .టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సర్టిఫికేట్ కోర్స్ ఆన్ మ్యూజియాలజీ" మరియు "సర్టిఫికేట్ కోర్స్ ఆన్ ఆర్కియాలజీ" కోర్సులను యువత వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కోర్సుల ద్వారా పర్యాటక, పురావస్తు, మ్యూజియం రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు. కోర్సులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. నాగరాజును సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు:9849905722, 9849905723, ఈ-మెయిల్ ఐడి:

## 'మీ సురక్ష'కు విశేష స్పందన

**ఇంటి పనివాళ్లు, కిరాయిదారుల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి:**



ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ నేరేడ్‌మెట్, మే 18, నేటి శుభోదయ:ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఆధ్వర్యంలో చేపట్టిన 'మీ సురక్ష' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ తెలిపారు. ఇటీవల నగర పరిధిలో చోటుచేసుకుంటున్న దొంగతనాలు, మోసాలు, అనుమానాస్పద ఘటనల నేపథ్యంలో ప్రతి ఇంటి వద్ద పనిచేసే వ్యక్తుల పూర్తి వివరాలు నమోదు చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. ఇంటి పనివాళ్లు, డ్రైవర్లు, కేర్‌టేకర్లు, వాచ్‌మెన్‌లు, సెక్యూరిటీ గార్డులు, వంటవాళ్లు, కిరాయిదారులు తదితరుల వివరాలను 'మీ సురక్ష' గూగుల్ ఫారం లేదా క్యూఆర్ కోడ్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రతి వ్యక్తి వివరాలు పోలీసుల డేటాబేస్‌లో క్రమబద్ధంగా నమోదు కావడంతో నేరాల నియంత్రణకు, అనుమానాస్పద వ్యక్తుల గుర్తింపుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఇప్పటికే కాలనీలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులకు క్యూఆర్ కోడ్‌లు, గూగుల్ ఫారం లింక్‌లు అందజేసినట్లు చెప్పారు. ఇంకా నమోదు చేసుకోని వారు వెంటనే తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజలకు సౌకర్యంగా ఉండేలా పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక రిసెప్షన్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక పోలీస్ బృందాలు కాలనీలు, అపార్ట్‌మెంట్‌లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని వెల్లడించారు. ప్రజల సహకారంతోనే భద్రతా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి 'మీ సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

## 02 కె రన్ ప్రారంభించిన ఎంపీడీవో సుభాషిని...

**గౌతమ్ పూర్ నుండి రుద్రంపూర్ ప్రగతి మైదానం వరకు టు కే రన్...**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,మే 18, ( నేటి శుభోదయ ),ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా యువజనోత్సవ వారోత్సవాలు యూత్ వీక్ యోగ, ఏరోబిక్స్ 2 కే రన్ ప్రారంభం..తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా తేదీ 18 మేనుండి 23 మే వరకు జిల్లా మండల స్థాయిలలో యువజన వారోత్సవాలు యూత్ వీక్ అత్యంత ఘనంగా గౌతమ్ పూర్ నుండి ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చించుపల్లి ఎంపీడీవో సుభాషిని టూ టౌన్ ఎస్ఐ కిషోర్ ఎం పి ఓ సంధ్య పాల్గొన్నారు.ప్రజా ప్రగతి ప్రణాళిక లో



భాగంగా ఫిట్ ఓ యాక్టివ్ తెలంగాణ అనే నినాదంతో యోగ, ఏరోబిక్స్ 2 కే మారథాన్ రన్ కార్యక్రమాన్ని గౌతమ్ పూర్ కాలనీ పంచాయతీ కార్యాలయం నుండి రుద్రంపూర్ సింగరేణి ప్రగతి వనం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముందుగా జండా ఊపి ప్రారంభించిన ఎంపీడీవో సుభాషిని.ఈ కార్యక్రంలో డ్వాక్రా మహిళలు యూత్, క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఎంపీడీవో సుభాషిని టు టౌన్ ఎస్ఐ కిషోర్ మాట్లాడుతూ క్రీడలు శారీరక శ్రమ ద్వారానే ఆరోగ్యం పొందడానికి అవకాశం ఉందని, ఆరోగ్య తెలంగాణ ఫిట్ ఫిట్ ఓ ఆక్టివ్ తెలంగాణ సాదన ధ్యేయంగా ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని క్రీడల ద్వారా చిన్న పిల్లల దగ్గర నుంచి అన్ని వయసుల వారు ఆరోగ్యం ఫిట్నెస్ కలిగి ఉండాలని అందరూ కుడా క్రీడలలో భాగస్వామిలవటం మన ఆరోగ్యాన్ని రక్షించుకోవడం అని వారన్నారు. ఈ కార్యక్రమంలో గౌతంపూర్ ఉపసర్పంచ్ గంగారం రుద్రంపూర్ ఉపసర్పంచ్ తోటరాజు వివోఏ లు ఆశ వర్కర్లు అంగన్వాడీలు స్కూల్ టీచర్లు పంచాయతీ సెక్రటరీలు గౌతమ్ పూర్ ప్రజలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం

**ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా ఎస్పీ**

నేటి శుభోదయ, సంగారెడ్డి ప్రతిని:ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్.హెచ్.ఓలకు సూచనలు.. : జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపిఎస్ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విన్న ఎస్పీ, సంబంధిత అంశాలపై స్థానిక ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోయిన పక్షంలో ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అలాగే మధ్యవర్తులను నమ్మకుండా, తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

## ఎంపీ వద్దిరాజు అధ్యక్షతన సమావేశమైన మున్నూరుకాపు ఫౌండేషన్ ట్రస్ట్ బోర్డు



హైదరాబాద్, నేటి శుభోదయ ::: హైదరాబాద్ నగర శివార్లలోని కోకాపేటలో ఆత్మగౌరవ భవన (మున్నూరుకాపు టవర్స్)నిర్మాణాన్ని మరింత వేగవంతం చేయాలని మున్నూరుకాపు ఫౌండేషన్ (ట్రస్ట్ బోర్డు)నిర్ణయించింది. ఆత్మగౌరవ భవన నిర్మాణానికి గాను గత ప్రభుత్వం కోకాపేటలో 5 ఎకరాల భూమిని కేటాయించిన విషయం తెలిసిందే.ఫౌండేషన్ ఛైర్మన్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ట్రస్ట్ బోర్డు సభ్యులు,ప్రభుత్వ సలహాదారు రాజ్యసభ మాజీ సభ్యులు, వీ.హనుమంతరావు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు దానం నాగేందర్,గంగుల కమలాకర్,ట్రస్ట్ బోర్డు సభ్యులు సర్దార్ పుటం పురుషోత్తమ రావు,వీ.ప్రకాష్,సీ.విఠల్,రౌతు కనకయ్య,తూడి ప్రవీణ్, రమేష్ హజారీ, మంగళారపు లక్ష్మణ్,పన్నాల విష్ణువర్ధన్ తదితరులు హాజరయ్యారు.ఈ టవర్స్ నిర్మాణం పనులను మరింత వేగవంతం చేసేందుకు గాను వారు పలు సూచనలు చేశారు, సలహాలిచ్చారు.భవిష్యత్ తరాల వారికి ఎంతగానో ఉపయోగపడే విధంగా గొప్పగా నిర్మించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలు,దేశ, విదేశాలలో నివశిస్తున్న, స్థిరపడిన పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు,ప్రముఖుల నుంచి విరాళాలు సేకరించాలని సమావేశం తీర్మానించింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ 50 లక్షల రూపాయల విరాళం ప్రకటించగా, ఫౌండేషన్ ఛైర్మన్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అందుకు సంబంధించిన రశీదు అందజేశారు. వసుంధరా బిల్డ్ ఎక్స్ ఛైర్మన్,కాపు నాయకులు పోతురెడ్డి రమేష్ బాబు సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై తాను గతంలో అందజేసిన రూ.10 లక్షలకు కొనసాగింపుగా మున్ముందు మరింత చేయూతనందిస్తానని స్వచ్ఛందంగా ప్రకటించారు.ఈ సందర్భంగా రమేష్ బాబు ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యేలు దానం,గంగుల, ఫౌండేషన్ సభ్యులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు బహుకరించారు.ఈ సందర్భంగా రమేష్ బాబును వద్దిరాజు, గంగుల శాలువా కప్పి సన్మానించారు,ఆయన వెంట గంగసాని నవీన్ పటేల్,జెన్నాయికోడే జగన్మోహన్,బేతంచర్ల శ్రీనివాస్ నాయుడు తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు ఇవ్వండి కలెక్టర్ కు సిపిఐ వినతి



కొనిజర్ల, నేటి శుభోదయ ::: అరులైన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కొణిజర్ల మాజీ జెడ్పీటీసీ సభ్యులు దొండపాటి రమేష్, జిల్లా సిపిఐ నాయకులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు లు సోమవారం ఖమ్మం కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేకుల కింద నివాసం ఉంటున్న వారు ఇందిరమ్మ ఇల్లు వస్తాయని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు, కానీ వారికి ఇందిరమ్మ ఇల్లు రాకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని వారు కలెక్టర్ కు వివరించారు. చివరకు పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించిన కొణిజర్ల మండలం చిన్న గోపతి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు అరులైన వారికి ఇవ్వకపోవటం విచారకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 2005 ఆనాటి ఉమ్మడి రాష్ట్రంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలోని ఇందిరమ్మ పథకం ప్రతి ఇంటికి రాజకీయాలకు అతీతంగా పక్కా ఇల్లు వచ్చాయని వారన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో ఈనాడు చెప్పేదొకటి చేసేది ఒకటే లాగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ఉన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ పథకాన్ని అమలు విధానాన్ని ప్రభుత్వం వ్యవహరించాలని వారు ప్రభుత్వం కోరారు. గాలి వానలు ప్రారంభం అయితే ఇల్లు నిర్మించుకోవడం నివాస ఉండటం ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులు ఎదురు కాకుండా, ఇందిరమ్మ ఇళ్లను తక్షణమే అర్హులైన వారందరికీ ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టర్ ను కలిసిన వారిలో సిపిఐ మండల నాయకులు దేరంగుల లక్ష్మయ్య, తమ్మిశెట్టి ఉపేందర్, గ్రామ ఉపసర్పంచ్ తమ్మిశెట్టి విజయ, దేరంగుల దినేష్, తమ్మిశెట్టి వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం నగరంలో పచ్చదనాన్ని
# పెంపొందించడం కోసం ప్రణాళికలు

**: హార్టికల్చర్ ఆఫీసర్ బెల్లం రాధిక**



ఖమ్మం, నేటి శుభోదయ ::: రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఖమ్మం నగరంలో పచ్చదనాన్ని పెంపొందించడం కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి అని సంబంధించిన అధికారులను హార్టికల్చర్ ఆఫీసర్ బెల్లం రాధిక గార్డెన్ సూపర్వైజర్ల కు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలో పచ్చదనాన్ని మరింత పెంపొందించే లక్ష్యంతో ప్రస్తుతం నర్సరీల్లో పెంచుతున్న మొక్కల రకాలు, వాటి సంరక్షణ, వర్షాకాలంలో ఏ ప్రాంతాల్లో ఏ మొక్కలు నాటాలి అనే అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.ఖమ్మం నగరంలోని డివైడర్లు, పార్కులు, ప్రధాన రహదారులు, కాలనీలు, ఖాళీ ప్రదేశాల్లో ఎక్కడ మొక్కలు తక్కువగా ఉన్నాయో గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా మొక్కలు నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని హార్టికల్చర్ ఆఫీసర్ బెల్లం రాధిక సూచించారు.వర్షాకాలం ప్రారంభానికి ముందుగానే అవసరమైన మొక్కలను సిద్ధం చేసి, నగరాన్ని మరింత పచ్చదనంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

**ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**– ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్**



ఖమ్మం, నేటి శుభోదయ ::: ప్రజా వినతులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.వేంసూర్ మండలం మర్లపాడు గ్రామంలోని స్టేట్ పంచాయత్ రాజ్ చాంబెర్ ఫార్మర్ డైరెక్టర్ భీం రెడ్డి పుల్లా రెడ్డి గ్రామంలో ఆర్ అండ్ బి రోడ్డు నుంచి ఎం. అంజయ్య ఇంటి వరకు సిసి డ్రైయిన్ నిర్మించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పంచాయత్ రాజ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కొణిజెర్ల మండలం రాజ్యతండా కు చెందిన టి.సునీత, బి.కృష్ణ, సత్యనాగేంద్ర ముగ్గురు కలిపి గుండ్రాతిమడుగు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 46/ఊ/2/1/2 లో కొంత భూమి ఉందని, వీటి మార్కెట్ విలువ అధికంగా ఉందని దీనినీ తగ్గించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా అదనపు కలెక్టర్ రెవెన్యూకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ కరీమ్ టీ హబ్ డయాగ్నస్టిక్ సెంటర్ నందు ఔట్సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్ గా పనిచేస్తున్నప్పుడు టర్మినేషన్ పద్ధతిలో విధుల నుండి తొలగించారని తిరిగి తనకు ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఎంఅండ్ హెచ్ఓకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి(92)ఫిర్యాదులు జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

**సంబంధిత అధికారులను ఆదేశించారు.**



ఇబ్రహీంపట్నం (నేటి శుభోదయ)ప్రతినిధి మే 18:సోమవారం జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (92) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ--32, ఇతర శాఖలు -60 , మొత్తం 92 దరఖస్తులు అందాయి.అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ జనాభా గణన-2027 కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేటర్లు ఇండ్ల గణన ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. జనగణన గృహ జాబితా ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని,ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని తెలిపారు.సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి ఇంటిని కవర్ చేయాలని, ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఏ ఒక్క



కుటుంబం మిగలకుండా అన్ని కుటుంబాల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. సర్వేలో సేకరించే సమాచారం ఖచ్చితంగా నమోదు చేయాలని, డిజిటల్ ఎంట్రీలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో పని చేస్తున్న సిబ్బంది ప్రజలకు జనగణన ప్రాధాన్యతను వివరించి ప్రజల సహకారం పొందాలని తెలిపారు.ఇంటింటి సర్వే ప్రక్రియను అధికారులు నిర్దేశిత గడువులోపు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ( రెవెన్యూ), కిరణ్మయి (లోకల్ బాడీస్) జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి

**మత పెద్దలతో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ మీటింగ్లో కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,మే 18,( నేటి శుభోదయ ),శాంతియుత వాతావరణంలో పండుగలను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ అన్నారు.రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం కొత్తగూడెం 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్ ఒ ఎంఫంక్షన్ హాలు నందు పట్టణంలోని మతపెద్దలతో పీస్ కమిటీ మీటింగ్ ను నిర్వహించారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనల కు తావు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పండగలను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.ప్రజలంతా పండుగలను మతసామరస్యంతో జరుపుకునే విధంగా ఆయా మతాల పెద్దలు ప్రజల్లో సమన్వయం ఏర్పడేలా చేయాలన్నారు. పండుగ ఏ మతానిది అయిన సామరస్యత చాలా మంచి సంబంధాలను పెంపొందిస్తుందన్నారు.రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా శాంతియుత



వాతావరణంలో జరిగేలా మత పెద్దలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని,ఎవరైనా గొడవలు సృష్టించేలా వ్యవహరిస్తే వెంటనే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ సమావేశంలో కొత్తగూడెం పట్టణంలోని అన్ని మతాల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ పీస్ కమిటీ సమావేశంలో కొత్తగూడెం 2టౌన్ ఇన్స్పెక్టర్ ప్రతాప్,చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు,1టౌన్ సీఐ కరుణాకర్,3టౌన్ సీఐ ఇంద్రాసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పథకాల పనితీరు ఆదర్శనీయం

**– ప్రతి ఒక్కరు ప్రతిరోజు ఒక చిన్న రన్ చేసి ఆరోగ్యంగా ఉండండి**

**– 2కే రన్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత**



మధిర, నేటి శుభోదయ ::: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పథకాల పనితీరు ఆదర్శనీయమని మధిర మున్సిపల్ చైర్ పర్సనల్ సామినేని సుజాత అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం మధిర పట్టణంలో యువజన అండ్ క్రీడల వారోత్సవాల్లో భాగంగా 2కే రన్ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని మధిర టౌన్ సిఐ రమేష్,ఎంపీడీవో వెంకటేశ్వర్లు తో కలిసి చైర్మన్ సుజాత ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పై చైతన్యం పెంచేందుకు ప్రభుత్వం 2కే రన్ వంటి కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని అన్నారు.ప్రతి ఒక్కరు ప్రతిరోజు ఒక చిన్న రన్ చేసి ఆరోగ్యంగా ఉండాలని ఆమె సూచించారు.ఏ కార్యక్రమం విజయవంతానికైనా ప్రజల మద్దతు అవసరమని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ప్రవేశపెట్టిన పథకాలు విజయవంతం కావడానికి ప్రజల ఆదరణే కారణమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బోడేపూడి రేవతి,నకిరే కంటి రాజేశ్వరి,బుల్లెద్దు విజయ కుమారి,యన్నం కోటేశ్వరరావు,రమణ నాయక్,కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ అధ్యక్షులు పారుపల్లి విజయ్ కుమార్, తలుపుల వెంకటేశ్వర్లు,గద్దల నాని, దోర్నాల రవి,యోగా గురువు నాళ్ళ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అడ్వాన్స్ బుకింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు




ఏన్కూర్, నేటి శుభోదయ::హెచ్ టి పత్తి విత్తనాలు రాత్రి సమయంలో అవుతున్నారని అటువంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని అడ్వాన్స్ బుకింగ్ చేస్తే వారిపట్ల కఠిన చర్యలు తప్పవని సహాయ వ్యవసాయ సంచాలకులు కరుణశ్రీ హెచ్చరించారు. ఏన్కూరు మండల కేంద్రంలోని రైతు వేదిక లో పురుగుల మందులు, ఎరువుల డీలర్ల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాత్రి వేళలో వివిధ రకాల హెచ్ టీ పత్తి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. 2026- 27 సంవత్సరానికి డీలర్లు అందరూ తప్పనిసరిగా లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని ఆమె సూచించారు. డోరు నెంబర్ లు, గోడౌన్ నెంబర్ లు మార్పు ఉంటే అటువంటి వాటిని లైసెన్స్ లో పొందు పరచాలని ఆమె కోరారు. స్టాక్ బోర్డు రైతులకు అందుబాటులో ఉంచాలని ,అనుమతి లేని వ్యక్తులు అనుమతులు అయినటువంటి హెచ్ టి పత్తి విత్తనాలు రాత్రి వేళలో అమ్ముతున్నారని వారి పట్ల కఠిన చర్యలు ఉంటాయని, సమాచారం తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్లో లేదా వ్యవసాయ శాఖ సంబంధించిన టోల్ ఫ్రీ నెంబర్ల కు తెలియజేయాలని కోరారు. హెచ్ టి పత్తి విత్తనాలు అమ్మితే కొనకుండా నిలువరించేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి అడ్డుకట్ట వేయాలని కోరారు. అందరూ బాధ్యతతో ఈ విషయంపై దృష్టి పెట్టాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నరసింహారావు, భాగ్యలహరి, అశోక్, కమలాకర్, డీలర్ అసోసియేషన్ అధ్యక్షులు చిట్టిబాబు, భద్రం ఫెర్టిలైజర్, వెస్ట్ సైడ్ డీలర్లు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్గా
## పదోన్నతి పొందిన బెల్లం రాధిక కి అభినందనల వెల్లువ



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్లో హార్టికల్చర్ అధికారిణిగా విశిష్ట సేవలు అందిస్తూ నగర సుందరీకరణ, పచ్చదనం అభివృద్ధికి విశేష కృషి చేసిన బెల్లం రాధిక ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ (ఎఫ్ డిఓ ) గా పదోన్నతి పొందిన సందర్భంగా హాస్టల్ వెల్ఫేర్ ఫోరం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని వారి చాంబర్లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా వారి దంపతులకు పూల మొక్కను జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం పదోన్నతి పొందిన సందర్భంగా ఖమ్మం మునిసిపల్ ఫ్రీడమ్ పార్క్లో రాధిక చే “మొక్కను నాటించి పర్యావరణ పరిరక్షణకు సంకేతంగా” కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రుక్మారావు మాట్లాడుతూ బెల్లం రాధిక మున్సిపల్ హార్టికల్చర్ అధికారిణిగా ఖమ్మం నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దడంలో, పార్కుల అభివృద్ధి, పచ్చదనం పెంపొందింపులో విశేష కృషి చేశారని, నగర సుందరీకరణలో ఆమె చేసిన సేవలకు ప్రజల నుంచి, అధికార వర్గాల నుంచి ప్రశంసలు అందుకున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆమె తన విధుల్లో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఫోరం ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. వెంకట్ రెడ్డి, వసతి గృహ సంక్షేమ అధికారులు కే.నరేందర్, యన్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## జన్ జాతీయ గౌరవ ఉత్సవ్
## కార్యక్రమాన్ని ప్రారంభించిన ఐటిడిఏ శుభమ్ నొక్వాల్



చింతూరు, నేటి శుభోదయ ::: కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ (మోట ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న “జన్ జాతీయ గౌరవ ఉత్సవ్” కార్యక్రమాన్ని సోమవారం ఐటిడిఏ చింతూరు పరిధిలో ప్రాజెక్ట్ ఆఫీసర్ శుభమ్ నొక్వాల్ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం 18 మే 2026 నుండి 25 మే 2026 వరకు కొనసాగనుందని తెలిపారు . ప్రారంభ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించడం, గ్రామ స్థాయిలో సేవల అందుబాటును మెరుగుపరచడం, విద్య, ఆరోగ్యం, ఉపాధి, జీవనోపాధి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.అదేవిధంగా, 19 మే 2026 నుండి 25 మే 2026 వరకు అన్ని ఏ ఎస్ కే గ్రామాలలో ప్రత్యేక ఆరోగ్య పరీక్షల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు సికిల్ సెల్ అనీమియా పరీక్షలు మరియు క్షయ వ్యాధి (టీబీ ) నిర్ధారణ పరీక్షలు నిర్వహించబడతాయి. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే “జనసున్వాయి” ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వీలైనంత త్వరగా పరిష్కారం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పాలసీ పరమైన అంశాలకు సంబంధించిన వినతులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ గారు “సబ్సే దూర్ -- సబ్సే పహలే” అనే భావనను ప్రస్తావిస్తూ, ప్రభుత్వ సేవలు ప్రతి గిరిజన కుటుంబానికి ప్రాధాన్యతతో చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.అధికారులకు ముఖ్య సూచనలు జారీ చేశారు.ప్రతి మండల స్థాయి అధికారి తమ పరిధిలో కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలి. గ్రామస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కల్పించాలి. ఆధిప్రసారన్ పోర్టల్లో బ్లాక్ స్థాయి మరియు గ్రామ స్థాయి అధికారుల నమోదు తక్షణమే పూర్తి చేయాలి. ప్రతి



కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు, నివేదికలు నిర్ణీత సమయంలో అప్లోడ్ చేయాలి.ఆరోగ్యం, విద్య, పరిశుభ్రత, పోషణ, జీవనోపాధి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. అధికారులు గ్రామ సందర్శనలు నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కార చర్యలు చేపట్టాలి.ఆరోగ్య శాఖ సిబ్బంది అన్ని ఏ ఎస్ కే గ్రామాలలో ఆరోగ్య పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి.అధికారులు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా గిరిజన ప్రాంతాలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ అవుతాయని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీవో ఐటిడిఏ చింతూరు శ్రీమతి రామతులసి , నాలుగు మండలాల ప్రత్యేక అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 20న మెడికల్ షాపుల బంద్

**– చింతూరులో అధికారులకు ముందస్తు సమాచారం**



చింతూరు, నేటి శుభోదయ ::: దేశవ్యాప్తంగా ఈ నెల 20వ తేదీ బుధవారం నిర్వహించనున్న అఖిల భారత కెమిస్టుల సమ్మె నేపథ్యంలో మండల కేంద్రంలోని మెడికల్ షాపుల నిర్వాహకులు ముందస్తుగా అధికారులకు సమాచారం అందజేశారు.ఆన్లైన్లో మందుల అమ్మకాలను నిలిపివేయాలని, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను అరికట్టాలని, నకిలీ మందుల విక్రయాలను నియంత్రించాలని కోరుతూ అఖిల భారత కెమిస్టులు,డ్రగ్గిస్టుల సంఘం దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో చింతూరు మండల కేంద్రంలోని మెడికల్ షాపుల యజమానులు సమ్మె నిర్వహణపై ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, చింతూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గోపాల్ కృష్ణ కు ముందస్తు సమాచారం అందజేశారు.అత్యవసరంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు ముందుగానే అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని మెడికల్ షాపుల నిర్వాహకులు సూచించారు. సమ్మె కారణంగా వినియోగదారులకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అహ్మద్ అలీ ,హాసన్ అలీ, నాని, వెంకట రమణ, వెంకన్న, , సాయి ,మనోహర్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## యువజన వారోత్సవాల్లో ఆకట్టుకున్న 2కె రన్



కేశంపేట, నేటి శుభోదయ:ప్రజాపాలన ప్రగతి నివేదిక 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కేశంపేట మండల కేంద్రంలో యువజన వారోత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన 2కె రన్ కార్యక్రమం యువతలో విశేష ఉత్సాహాన్ని నింపింది. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ రన్లో పెద్ద సంఖ్యలో యువకులు, విద్యార్థులు పాల్గొని ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకున్నారు.“యువత ఆరోగ్యమే గ్రామాభివృద్ధికి బలం” అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆకట్టుకుంది. పాల్గొన్న యువత క్రమశిక్షణతో రన్ పూర్తి చేయగా, విజేతలకు అధికారులు బహుమతులు అందజేసి అభినందించారు. యువత క్రీడలు, వ్యాయామం పట్ల ఆసక్తి పెంచుకోవాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ ఎంపీడీవో రవిచంద్రకుమార్, సీఐ నరహరి, ఎంఈఓ చంద్రశేఖర్, కేశంపేట సర్పంచ్ సంతోష్ శ్రీశైలం యాదవ్, చింతకుంటపల్లి సర్పంచ్ రమేష్ యాదవ్, వేములనర్వ సర్పంచ్ సువర్ణ నర్సింహా, వార్డ్ మెంబర్ దశరథ్, బీఆర్ఎస్ నాయకులు బైకని శేఖర్, గోపాల్, ప్రవీణ్ రెడ్డి, శ్రీకాంత్, గ్రామ సెక్రటరీలు మరియు పలువురు యువకులు పాల్గొన్నారు.



## అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్
## కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**: జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్**

ఖమ్మం, నేటి శుభోదయ ::: మైనారిటీ మహిళలకు అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మైనారిటీ మహిళలకు అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సులో ఉచిత శిక్షణ అందించనున్నట్లు, ఖమ్మం జిల్లాకు చెందిన ముస్లిం, సిక్కు, జైన, బౌద్ధ, పార్సీ మైనారిటీ మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలల వ్యవధి గల ఈ కోర్సుకు ఇంటర్, అంతకంటే పై చదువులు పూర్తి చేసిన 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలు అర్హులని పేర్కొన్నారు.దరఖాస్తుదారులు ఇన్కమ్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు (10వ తరగతి, ఇంటర్), రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలు సమర్పించాలని తెలిపారు.అర్హత , ఆసక్తి గల అభ్యర్థులు బల్లెపల్లి లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పైన ఉన్న విన్సోల్ ఎడ్యుకేషనల్ సొసైటీ లో గాని, జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని రెండవ అంతస్తు, గది నం. ఎస్ -29 లో గల జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.ఇతర వివరాలకు 9704003002 నంబర్ లో సంప్రదించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ ఆ ప్రకటనలో తెలిపారు.

